
రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0 (గురువారం)
కనిష్ఠం : 26.0


ప్రకృతి.. వలయం : కశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతం


మంచుకొండల్లోన సంద్రమా : కశ్మీర్ సోనామార్గ్‌లో గురువారం మంచు ఇలా..

అందాల కశ్మీరం.. ఉగ్రదాడితో కాష్మోరాగా మారిపోయింది.. కాష్మోరా సినిమా చూడాలంటేనే భయపడినట్లు.. ప్రస్తుతం కశ్మీరం వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.. వేసవి సెలవుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్న వందలాదిమంది తమ టూర్ క్యాన్సిల్ చేసుకుంటున్నారు.. ఆ అందాల రాక్షసిని తిలకించాలంటే ముందు మేం ఉండాలి కదా.. అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు..

- కాకినాడ,ఆంధ్రజ్యోతి

అందాల రాక్షసివే.. కశ్మీర్..టెర్రర్

రాజమహేంద్రవరంలో ఓ వ్యాపారి వేసవి సెలవుల్లో కుటుంబంతో సహా కశ్మీర్ వెళ్లాలని ముందే ప్లాన్ చేశారు. ఆరుగురి కోసం ముందే ఫ్లైట్ టిక్కెట్స్, హోటల్స్ బుక్ చేసుకున్నారు. తీరా కశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేధంతో అక్కడకు వెళ్లలేక టూర్ క్యాన్సిల్ చేసుకున్నారు.

కాకినాడలో రెవెన్యూశాఖకు చెందిన ఆరుగురు ఉద్యోగులు సెలవుపెట్టి కశ్మీర్‌కు బయలుదేరారు. తీరా ఢిల్లీలో విమానం దిగి ఉదయాన్నే కశ్మీర్‌కు బయలుదేరాలనుకునేలోగా ఉగ్రవాదుల దుశ్చర్యతో కాశ్మీర్ ట్రిప్ రద్దు చేసుకున్నారు. తిరుగు విమానం టికెట్లు ఈనెల 26వ తేదీకి బుక్ చేయడంతో చేసేదిలేక ఢిల్లీలోనే ఉండిపోయారు. మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉండిపోయి చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాద దుశ్చర్య జరగడానికి ఐదు రోజుల ముందే అక్కడి నుంచి కాకినాడకు వచ్చిన కొందరు పర్యాటకులు జరిగిన సంఘటన తల్చుకుని బెంబేలెత్తిపోతున్నారు. తాము పహల్గాం నుంచి బైరసన్‌కు గుర్రాల్లో వెళ్లామని, అదే ప్రాంతంలో నరమేధం జరిగిందని తెలిసి ఒళ్లు జలదరించిందని కాకినాడ నగరానికి చెందిన కొందరు పర్యాటకులు వివరించారు.

- » ఉగ్రవాదుల దుశ్చర్య
- » పర్యాటకుల్లో గుబులు
- » పలు బుకింగ్‌లు రద్దు
- » టూర్ ఏజెన్సీల గగ్గోలు
- » కొంత మంది ఢిల్లీకి పయనం
- » అక్కడ చిక్కిన టూరిస్ట్‌లు
- » తిరిగి వచ్చేందుకు ఒత్తిడి
- » ఖాళీ అవుతున్న కశ్మీరం

కశ్మీర్‌లోయలోని పహల్గాంలో ఈనెల 22న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో కశ్మీర్‌లో ఉన్న పర్యాటకులు ప్రాణభయంతో తిరుగుముఖం పట్టారు. దీంతో చాలావరకు కశ్మీర్ ఖాళీ అయిపోయింది. మరో పక్క అక్కడకు సరదాగా వెళ్లాలని ముందే ప్లాన్ చేసుకున్న అనేక కుటుంబాలు ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నాయి. ఈ వేసవిలో సరదాగా కశ్మీర్ వెళ్లడానికి ఉమ్మడి జిల్లాలో పలు కుటుంబాలు టూర్ ఏజెంట్లను సంప్రదించి నెల రోజులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇప్పుడు ఉగ్రవాదుల దుశ్చర్యతో కశ్మీర్‌కు వెళ్లాలనుకున్న పర్యాటకులు రద్దు చేసుకుంటున్నారు. దీంతో ఏజెంట్లు గగ్గోలు పెడుతున్నారు.

బుకింగ్‌లు రద్దు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి దేశ, విదేశాల్లో వివిధ టూరిస్ట్ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకుల కోసం 75 వరకు టూర్ అండ్ ట్రావెల్ ఏజెన్సీలున్నాయి. స్వదేశంలో ఏర్పాట్లకు 42 వరకు సర్వీసులు అందిస్తున్నాయి. ఈనెల, వచ్చే నెలలో కలిపి ఈ రెండు నగరాల నుంచి దాదాపు 170 వరకు వివిధ కుటుంబాలు, గ్రూపులు ఢిల్లీ, కశ్మీర్‌కు బుకింగ్‌లు చేసుకున్నాయి. కానీ ప్రస్తుతం అక్కడకు వెళ్లడం ప్రమాదంతో కూడుకున్నందున వీరంతా తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. కొందరైతే ఆన్‌లైన్‌లో సొంతంగా చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటున్నట్టు కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన రెండు టూర్ ఏజెన్సీలు వివరించాయి. ఉమ్మడి జిల్లాలో కశ్మీర్ టూర్‌కు టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులకు హోటల్స్ బుకింగ్ రద్దుకు అంగీకరించగా, కొన్ని విమాన కంపెనీలు టికెట్ బుకింగ్ ఆప్షన్‌లో క్యాన్సిలేషన్ లేదేని తెగేసి చెబుతున్నాయి. కశ్మీర్ వెళ్లేవారంతా ఢిల్లీ నుంచే రైళ్లలోను, విమానాల్లోనూ వెళతారు. దీంతో కొందరు డబ్బులు వదిలేసుకుని పర్యటన రద్దు చేసుకోగా.. కొందరు పర్యాటకులైతే డబ్బులు వదులుకోలేక ఢిల్లీ వరకు వెళ్లి కొన్నిరోజులు ఉండేలా సిద్ధమవుతున్నారు. ఇలా కొందరు పర్యాటకులు ఈనెల 26, 27 తేదీల్లో పయనమవుతున్నట్టు రాజమహేంద్రవరానికి చెందిన ట్రావెల్ ఏజెన్సీ వివరించింది. ఇప్పటికే శ్రీనగర్‌లో ఉన్న పర్యాటకులు వెనక్కు రావడానికి విమానం టిక్కెట్లు బుక్ చేయాలని, లేదా ఢిల్లీదాకా తెలిసిన టూర్ ఏజెన్సీ వాహనాలు బుక్‌చేయాలని కోరుతున్నట్టు సమాచారం.

వేసవిలో వెళ్లేది ఇందుకే..

ఏప్రిల్‌లో మనకు ఎండలు మండిపోతుంటాయి. 38 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉంటుంది. కశ్మీర్‌లో పగటి ఉష్ణోగ్రత 5 నుంచి 13 డిగ్రీల వరకు ఉంటుంది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనేక చోట్ల మైనస్ 3 డిగ్రీలు ఉంటుంది. గురువారం కశ్మీర్‌లోని సోనామార్గ్‌లో రాత్రి 8 గంటలకు ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు నమోదైంది. బుధవారం అయితే రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మైనస్ 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉగ్రవాద దుశ్చర్య జరిగిన పహల్గాంలోని బైసరన్‌లో గురువారం రాత్రి రెండు డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. కశ్మీర్‌లో అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సైతం ఆరు నుంచి ఎనిమిది డిగ్రీలే ఉంటోంది. ప్రకృతి అందాలు, హిమాలయ సోయగాలు ఈ సమయంలో ఎంతగానో అలరిస్తాయి. దీంతో కశ్మీర్‌కు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.

కశ్మీర్‌కు ఇప్పుడే ఎందుకంటే..

జమ్ముకశ్మీర్ ఏప్రిల్ నుంచి మరింత అందంగా మారుతుంది. ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తుంది. మార్చి మూడో వారం వరకు కశ్మీర్‌లోని శ్రీనగర్, పహల్గాం, గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాల్లో మంచు కురుస్తుంటుంది. మార్చి ఆఖరు నుంచి.. ఏప్రిల్ ఆరంభంలో మంచు కురవడం ఆగిపోయి వందల మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన భారీ మంచు కొండలు కరగడం మొదలవుతాయి. ఈ సమయంలో హిమాలయాలు, దాల్ లేక్‌లో పడవ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. అందుకే ఈ సమయంలో పర్యాటకులు దేశవ్యాప్తంగా కశ్మీర్‌కు పోటెత్తుతారు. ప్రతి ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ సీజన్‌లో కశ్మీర్‌కు గ్రూపు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.



ఏ రైలూ.. ఖాళీ లేదు..!

- » రైళ్లన్నీ ఫుల్.. రిజర్వేషన్లు నిల్
- » వేసవికి విహార యాత్ర ఎలా?
- » తిరుపతికి డబుల్ డెక్కరే గతి
- » బెంగళూరు..చెన్నైకి ఖాళీల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు వచ్చేశాయి. ఏడాది అంతా చదువులతో కుస్తీ పట్టే పిల్లలు.. ఇంటి పట్టునే ఉంటూ కుటుంబం బాగోగులు చూసుకొనే గృహిణులు.. ఉదయం ఆఫీస్‌కి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరే ఉద్యోగులు.. కాస్త సేదతీరాలనుకొనే రోజులు ఏప్రిల్, మే నెలలు.. ఏడాదిలోని మిగతా నెలల్లో పిల్లలకు స్కూలు ఉండడంతో ఎక్కడికైనా వెనకడుగు వేస్తారు. వేసవిలో పిల్లలకు స్కూళ్ల సెలవులు ఇస్తారు కాబట్టి.. అలా ఎక్కడికైనా విహారయాత్రకు వెళదామని ప్లాన్ చేసుకుంటారు. ఏ టూర్‌లో అయినా రైలు ప్రయాణమే కీలకం. రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు చేయించుకుంటే ఫర్వాలేదు. ఇప్పటికిప్పుడు బయలుదేరితే మాత్రం కష్టమే. రైళ్లలో ఇప్పటికే మే నెలాఖరు వరకూ స్లీపర్‌తోపాటు ఏసీ క్లాసుల రిజర్వేషన్లు నిండుకున్నాయి. వెయిటింగ్ లిస్టులోకి ఎప్పుడో వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఏ రైలు చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది.

- సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్లు నడిచే తేదీలను పొడిగించడం మినహా చెప్పుకోగ్గ స్థాయిలో ఈ ప్రాంతం వాళ్లకు ఈ వేసవి ప్రత్యేక రైళ్ల విషయంలో ఆ శాఖ దయ చూపలేదు. హైదరాబాద్‌కి వందే భారత్‌లు నడుస్తున్నా చార్జీలు సామాన్యుడు భరించలేనంతగా ఉన్న విషయం తెలిసిందే.
- వేసవిలో ముఖ్యంగా తిరుపతికి రద్దీ ఉంటుంది. కానీ శేషాద్రి ఎక్స్‌ప్రెస్ వెయిటింగ్ లిస్టు 100కి చేరగా, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో టికెట్లే లేవు. దిబ్రూగఢ్, సంత్రాగచి, హౌరా నుంచి వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు క్లోజ్ అయిపోయాయి. వారంలో మూడు రోజులు నడిచే డబుల్ డెక్కర్‌కి కొన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు మినహా ఏ రైలుకూ తిరుపతికి రిజర్వేషన్లు ఖాళీ లేవు.
- బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హటియా- హౌరా -న్యూతిన్సుకియా, టాటా, భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లు రాజమండ్రి గుండా వెళుతున్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమండ్రి వస్తుంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతి న్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికో సారి, గువాహటి నుంచి వారానికి మూడు సార్లు రైళ్లున్నా బోగీల్లో కాలుపెట్టలేం.
- చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి రైళ్లు ఉన్నాయి. హౌరా- కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికోసారి, సిల్చార్- కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్-విల్లుపురం, భువనేశ్వర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా -తిరుచిరాపల్లి (సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడు రోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్ -త్రివేండ్రం(మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శని వారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగుపెట్టడానికి వీలుండదు.

ఇంటర్ సిటీలు వేయాలి..

ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, అసోం, బిహార్ నుంచి ఉపాధి పనుల నిమిత్తం కూలీలు పెద్ద సంఖ్యలో కేరళ, తమిళనాడు, కర్నాటక వెళుతుంటారు. వేసవిలో తిరుగు ప్రయాణమవుతారు. అందుకే చెన్నై, బెంగళూరు, అళప్పుజ, తిరువనంతపురం నుంచి సిల్చార్, న్యూతిన్సూకియా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఖాళీ ఉండదు. ఈ క్రమంలో వేసవి సెలవులకు విహారయాత్రలకు వెళదామని అనుకున్న వారితోపాటు ఆస్పత్రి పనులపై చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొత్తగా వారాంతపు, బైవీక్లీ రైళ్లు వేస్తున్నా ఈ ప్రాంతం వాసులకు ఉపయోగం ఉండడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వేసవిలో నైనా విశాఖ-విజయవాడ,విజయవాడ-చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖ- భువనేశ్వర్,రాజమండ్రి-విజయవాడ, విశాఖపట్నం ఇంటర్ సిటీలు నడపితే నాలుగు జిల్లాల ప్రయాణికుల తిప్పలు తగ్గే అవకాశం ఉంది.

వితంతు పింఛన్లకు దరఖాస్తులు స్వీకరణ

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వితంతు పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.ఈ నేపథ్యంలో 2023 డిసెంబర్ 1 నుంచి 2024 డిసెంబర్ 31 మధ్య మరణిస్తే భార్యకు పింఛను మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు జిల్లాలో 3408 మంది అర్హులు ఉన్నారన్నారు. వితంతు పింఛన్ దరఖాస్తులు అప్‌లోడ్ చేయడానికి పోర్టల్ ప్రారంభించామన్నారు. అర్హులంతా సమీపంలోని సచివాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్, ఇతర విధానాల్లో పింఛన్ అర్జీలను పరిశీలించి జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ అర్హులు అనపర్తిలో 156మంది, బిక్కవోలులో 165, చాగల్లులో 152, దేవరపల్లిలో 163,గోకవరంలో 154, గోపాలపురంలో 165, కడియంలో 157, కోరుకొండలో 217, కొవ్వూరులో 127, కొవ్వూరు అర్బన్‌లో 42, నల్లజర్లలో 176, నిడదవోలులో 142, నిడదవోలు అర్బన్‌లో 60, పెరవల్లిలో 151, రాజమండ్రి అర్బన్‌లో 303,రాజమండ్రి రూరల్‌లో 234, రాజానగరంలో 241, రంగంపేటలో 158, సీతానగరంలో 173, తాళ్లపూడిలో 106, ఉండ్రాజవరంలో 166మంది ఉన్నారన్నారు. వీరంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. జేసీ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి గురువారం రెవెన్యూ, పీజీ ఆర్ఎస్, రీసర్వే వంటి అంశాలపై సమీక్షించారు. మండలాల వారీగా నీటివినియోగదారుల సంఘాల వివరాలు ప్రచురించాలన్నారు. నీటి తీరువా వసూళ్ల విషయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పర్యవేక్షణ చేయి స్తుందన్నారు.జిల్లాలో 2.8 లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలో రూ.2,84, 51,378 మేర పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు.ఇప్పటి వరకూ రూ.2,00,11,361 వసూలైందన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 40.57 శాతం, కొవ్వూరు డివి జన్‌లో 43.75 శాతం వసూళ్లు చేసినట్టు చెప్పారు. ఆయకట్టు పరిధిలో సాగు విస్తీర్ణం హెచ్చుతగ్గులను రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్ధారణ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముఖ్యంగా భూమి కొలతల్లో వ్యత్యాసాలు,ఎల్‌పీఎంకు చెందిన విభజన, దిద్దుబాట్లు, మ్యుటేషన్, సరిహద్దు కొలతలు ఐదు అంశాలు ఉన్నాయన్నారు. కొందరు సమీక్షలకు వచ్చామా, వెళ్లామా అనే ధోరణిలోనే ఉంటున్నారని అది సరికాద న్నారు. సమావేశంలో ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా సర్వే అధికారి బి. లక్ష్మీ నారాయణ, ఏవో అలీ, తహశీల్దార్లు పాల్గొన్నారు.


రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఎండ మావులు


- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

భానుడు గురువారం ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి చేశాడు.. ఏకంగా 42 డిగ్రీలకు చేరి మండిపడ్డాడు.. దీంతో జనం అపసోపాలు పడ్డారు.. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరంలో ఇలా ఎండమావులు దర్శనమిచ్చాయి. వీటిని జనం ఆసక్తిగా తిలకించి కెమెరాల్లో బంధించారు.

రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్ హబ్ 7



హాస్టల్..డల్!

- » హాస్టళ్లలో ఉత్తీర్ణత శాతం అంతంతే
- » ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పూర్ రిజల్ట్
- » బాగా పడిపోయిన ఉత్తీర్ణత శాతం
- » 65 మంది వరకూ ఫెయిల్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ విద్యార్థులు డల్‌గా ఉన్నారు.. జిల్లాలోని ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో పదవ తరగతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఫెయిలయ్యారు. దీంతో సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. బీసీ హాస్టల్స్‌కు సంబంధించి 92 మంది పరీక్షలు రాస్తే 69 మంది ఉత్తీర్ణులయ్యారు. 23 మంది ఫెయిలయ్యారు. మొత్తం 46 మంది బాలురు, 46 మంది బాలికలు పరీక్షలు రాశారు. వీరిలో 29 మంది బాలురు, 40 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. రాజమహేంద్రవరం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి పరిధిలో 32 మంది టెన్త్ పరీక్షలు రాస్తే నలుగురు బాలురు, 12 మంది బాలికలు పాసయ్యారు. 16 మంది ఫెయిల్ కావడం గమనార్హం. కొవ్వూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి పరిధిలో 60 మంది పరీక్షలకు హాజరుకాగా బాలురు 25 మంది, బాలికలు 28 మంది పాసయ్యారు. ఏడుగురు బాలురు ఫెయిలయ్యారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో చదువుతున్న 179 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 137 మంది మాత్రమే పాసయ్యారు. 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలో 47 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 38 మంది పాస య్యారు. 9 మంది ఫెయిలయ్యారు. ఎస్సీ హాస్టల్స్ విద్యార్థుల్లో మోర్త నవీన్ (బాలుర వసతిగృహం 1, రాజమహేంద్రవరం) 521 మార్కులు సాధించి హాస్టల్ విద్యార్థుల్లో టాప్‌లో నిలిచాడు. అలాగే, కర్రి రాహుల్ 518 మార్కులు (బాలుర వసతిగృహం, గౌరీపట్నం), పెన్నాడ శ్రావణి 505 మార్కులు, మానుకొండ హర్షిణి 503 మార్కులు (ఐడబ్ల్యూహెచ్‌సీ, బాలికల వసతి గృహం, చిన్నాయిగూడెం) సాధించారు. ఎస్టీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు ముగ్గురు ఫెయిలయ్యారు.

అంతరిక్ష అనుభవంలోకి..

వెల్‌కం సునీత.. ఆకట్టుకున్న లఘుచిత్రం



ఆంధ్రజ్యోతి-అమలాపురం రూరల్



సునీతా విలియమ్స్.. ఆ పేరు తెలియనివారెవరూ ఉండరంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అంతరిక్ష పరిశోధనలకు వెళ్లిన సునీతా విలియమ్స్ ఎదుర్కొన్న ఇబ్బందులు.. తిరిగి భూమికి అడుగిడినప్పుడు ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆడబిడ్డ పుట్టింటికి వచ్చినంత ఆనందం అనుభవించారు. ఆ ధీర వనిత, అంతరిక్ష అనుభవాలను నేపథ్యంగా తీసుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లోని సమనస గ్రామంలో ఉన్న శ్రీరామా పబ్లిక్ స్కూలు ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ తీసిన లఘుచిత్రం అందరినీ ఆకట్టుకుంటోంది. అదే పాఠశాలలో పది రోజులపాటు తీసిన లఘు చిత్రాన్ని ఆయనే స్వయంగా ఎడిటింగ్ చేయడానికి నెల రోజుల వ్యవధి పట్టింది. ప్రేక్షకులందరినీ అంతరిక్షంలోకి తీసుకు వెళ్లిన అనుభూతి కలిగించారు. వెనుకభాగంలో ఏర్పాటుచేసిన గ్రీన్ మ్యాట్‌పై సీన్‌ల వారీగా లొకేషన్లు మారుస్తూ (గ్రాఫిక్ డిజైన్లతో) లఘుచిత్రాన్ని నిర్మించారు. అంతరిక్షాన్ని తెరపై ఆవిష్కరించడంతోపాటు పాత్రధారులందరికోసం ప్రత్యేక కాస్ట్యూమ్స్‌ను కొనుగోలు చేశారు. సునీతా విలియమ్స్ సాహస గాథపై ప్రిన్సిపాల్ పురాణపండ లక్ష్మీగణేష్ రచనా, దర్శకత్వంలో రూపొందించిన ఈ లఘుచిత్రం ఆహూతులందర్నీ ఎంతగానో ఆకట్టుకుంది. 30 నిమిషాల నిడివి గల సాహస గాథను వెల్కమ్ సునీత... అంటూ తెరపైకి ఎక్కించిన తీరు ఆద్యంతం ఆకట్టుకుంది. సునీతా విలియమ్స్ నాసా కేంద్రం నుంచి అంతరిక్షంలోకి వెళ్లినప్పటి నుంచి తిరిగి భూమిపైకి అడుగిడే వరకు పలు అంశాలను లఘుచిత్రంలో పొందుపరిచిన తీరు అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. సమనసలోని శ్రీరామా పబ్లిక్ స్కూలు వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం లఘుచిత్రాన్ని విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, గ్రామస్తులు తిలకించి లక్ష్మీగణేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 2024 సంవత్సరంలో నాసా నుంచి అంతరిక్ష కేంద్రానికి బయలుదేరిన సునీత, విల్మోర్ సుమారు తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలో చిక్కుకుని ధైర్యసాహసాలతో తిరిగి ప్రాణాలతో భూమి మీదకు వచ్చిన ఎన్నో ఘట్టాలను కళ్లకు కట్టినట్టుగా ప్రత్యేక గ్రాఫిక్స్‌తో తీశారు. సునీత విలియమ్స్ పాత్రలో పాఠశాల విద్యార్థిని టి.శరణ్య, విల్మోర్ పాత్రలో ఎస్.గుణశేఖర్, చీఫ్ సైంటిస్ట్ పాత్రలో వి.వినోద్‌తోపాటు ఇతర విద్యార్థులు అనేక పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి రచనా, నిర్మాత, దర్శకత్వం, ఎడిటింగ్, గ్రాఫిక్స్‌ను లక్ష్మీగణేష్ నిర్వహించారు. ఈ లఘు చిత్ర ప్రదర్శనను ముఖ్య అతిథిగా హాజరైన అమలాపురం తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్ తిలకించి ప్రత్యేకంగా అభినందించారు.

లఘుచిత్రంలోని నాసా కేంద్రంలో ఘట్టాలు





కథ, దర్శకత్వం వహించిన లక్ష్మీగణేష్



నాసా కేంద్రంలో చర్చలు జరుపుతున్నట్టు తీసిన సీను

తరతరాల 'చుట్ట'రికం..!



కాకినాడ రామకృష్ణారావుపేటలో చుట్ట చుడుతున్న దృశ్యం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాలం మారుతోంది.. కాలానుగుణంగా జనాలు మారుతున్నారు. వారి అలవాట్లను మార్చుకుంటూ వస్తున్నారు. కాలగర్భంలో కొన్ని కలిసిపోతున్నా.. సంప్రదాయ పొగాకుతో తయారు చేసే చుట్లకు మాత్రం గిరాకీ తగ్గలేదు. రకరకాల సిగరెట్లు మార్కెట్లోకి వచ్చినా.. వీటి వినియోగం మాత్రం ఆగలేదు అనేందుకు ఈ చిత్రాలే నిదర్శనం.. అన్నింటా యంత్ర తంత్రమే సాగుతుండగా.. చుట్టల తయారీ మాత్రం చేతిలోనే సాగుతోంది. తరతరాలుగా కొందరు చుట్ల తయారీతోనే ఉపాధి పొందుతున్నారు. కాకినాడ నగరంలోని రామకృష్ణారావుపేటలో కొందరు ఇలా చుట్టలు చుడుతూ కనిపించారు. ఒకప్పుడు పావలాకు ఐదు చుట్టలు అమ్మితే.. ప్రస్తుతం ఒక చుట్ట ధర రూ.2కి చేరింది. ఒక్కో వ్యక్తి రోజుకి 500 వరకు చుట్టలు చుట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఇలా పలు కుటుంబాలు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

'సివిల్స్'లో మెరిసిన తాపేశ్వరం యువకుడు

- ఆలిండియా స్థాయిలో 333వ ర్యాంకు
- మూడో ప్రయత్నంలో విజయం సాధించిన పవన్



యండ్రు పవన్‌కుమార్

మండపేట,ఏప్రిల్24(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఫలితాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరానికి చెందిన యండ్రు పవన్‌కుమార్ ఆల్‌ఇండియా స్థాయిలో 333వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన మొదటి నుంచి చదువులో రాణించేవారు. పవన్ విద్యాభ్యాసం 1నుంచి పదో తరగతి మండపేట పట్టణంలో సాగింది. ఇంటర్ విజయవాడలో చదువుకున్నారు. అనంతరం బెనారస్‌లో ఐఐటీ మెకానికల్ చేశారు. సివిల్స్‌లో రెండుసార్లు విఫలమైనప్పటికీ మూడో ప్రయత్నంలో 333వ ర్యాంకును సొంతం చేసుకున్నారు.తాను ఎప్పటికైనా ఐఏఎస్ కావాలన్న కోరిక ఉండేదని, ఇపుడుతనకు వచ్చిన ర్యాంకుకు ఐఆర్ఎస్ లేదా ఐఎఫ్ఎస్ రావచ్చని పవన్ తెలిపారు. ఆయన తండ్రి ఎరువులు వ్యాపారి. వీరిది వ్యవసాయ కుటుంబం. తమ కుమారుడు సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడంపట్ల కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నివాళిగా..





కశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాలకు వ్యతిరేకంగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో గురువారం రాత్రి వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో అఖండ భారతదేశం ఆకృతిలో నిరసన తెలియజేస్తున్న దృశ్యం. అలాగే చింతూరులో హిందు, ముస్లింల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం - రాజానగరం/చింతూరు

నేడు పిఠాపురంలో..

డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు వచ్చిన పోలీసు బందోబస్తు

- రచ్చబండలో ప్రజలతో ముఖాముఖి
- అభివృద్ధి పనులకు శ్రీకారం
- పర్యటనకు భారీ బందోబస్తు


పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గంలో ఒక్క రోజు పర్యటన నిమిత్తం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుక్రవారం రానున్నారు. ఈ పర్యటన నిమిత్తం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

శుక్రవారం ఉదయం విశాఖ నుంచి రాజమహేంద్రవరం ప్రత్యేక విమానంలో వస్తారు. అక్కడినుంచి ఉదయం 9.20గంటలకు పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చేరుకుని అక్కడ ఉదయం 9.30గంటల నుంచి 10.15 గంటల వరకూ నిర్వహించే రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఇందుకుగాను విస్తృత ఏర్పాట్లు చేశారు. అక్కడినుంచి మధ్యాహ్నం 11గంటలకు కొత్తపల్లి చేరుకుని అక్కడ టీటీడీ కల్యాణ మండపం నిర్మాణపనులకు భూమిపూజ నిర్వహిస్తారు. అక్కడినుంచే గొల్లప్రోలు, చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానాల్లోని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు పిఠాపురం రథాలపేట అంబేడ్కర్ కమ్యూనిటీ హాలుకు చేరుకుని అక్కడ జరిగే టైలరింగ్ ఉచిత శిక్షణా తరగతుల్లో పాల్గొన్నవారికి కుట్టుమిషన్లు పంపిణీ చేస్తారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో యాంత్రీకరణ పథకం ద్వారా పరికరాలు, రైతులకు టార్పాలిన్లు అందజేస్తారు. మధ్యాహ్నం 12.35గంటలకు పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని 100 పడకల ఆసుపత్రి అప్‌గ్రేడేషన్ పనులకు శంకుస్థాపన చేస్తారు. అక్కడినుంచే నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు, సీసీ రోడ్లకు ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం 1.15 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో మంగళగిరికి మధ్యాహ్నం 2.20గంటలకు చేరుకుంటారు.


పర్యటనకు భారీ బందోబస్తు

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు 350మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఒక ఏఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 17మంది సీఐలు, 35మంది ఎస్ఐలు, హెచ్‌సీలు, పీసీలు, మహిళాపోలీసులు 300మందిబందోబస్తు విధుల్లో ఉంటారు. వీరికి అదనంగా ఏఎస్ఎస్ పార్టీలు, రోప్ పార్టీలు ఉన్నాయి. వీరు గురువారంసాయంత్రానికే ఇక్కడకు చేరుకున్నారు.

అవగాహనతోనే మలేరియా దూరం



కంటికి కనీకనిపించని చిన్న దోమ ద్వారా అనేక విష జ్వరాలు సోకి అవి మరణం వరకు తీసుకెళ్లిన ఎన్నో సంఘటనలను చూశాము. అయితే ముందస్తు జాగ్రత్త చర్యలు, అవగాహన కార్యక్రమాలతో మలేరియా దరిచేరకుండా తరిమేయవచ్చని వైద్యులు చెప్తున్నారు.





జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అనాఫిలిస్ అనే దోమ కాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఇది సోకిన వ్యక్తికి రక్త మార్పిడి ద్వారా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా వాంతులు, నిస్సత్తువ, తీవ్రమైన కండరాల నొప్పి, జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తాయి. ఈ జ్వరపీడితులకు సకాలంలో వైద్య చికిత్స అందించకపోతే తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుంది. మలేరియా తీవ్రతరమైతే రక్తహీనత, విరోచనాలు, పొత్తికడుపులో నొప్పి, శ్వాసకోశ ఇబ్బందులు, కండరాల నొప్పులు కనిపిస్తాయి. గత ఏడాది డబ్ల్యూహెచ్‌వో విడుదల చేసిన తాజా ప్రపంచ మలేరియా నివేదికలో మలేరియా కేసులు, మరణాలు గణనీయంగా తగ్గినట్టు వెల్లడించింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా 2024లో కేవలం ఐదు మలేరియా కేసులు మాత్రమే నమోదయ్యాయి. ఒక్క మరణం కూడా సంభవించలేదు.

ఒక్క కేసు కూడా నమోదు కాలేదు



డాక్టర్ విల్సన్, జిల్లా మలేరియా అధికారి

ఈ ఏడాది ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాకపోవడం ప్రజారోగ్య పరిరక్షణలో ఒక మంచి పరిణామం.

నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

గత ఏడాది 1,98,105 మలేరియా పరీక్షలు నిర్వహించగా కేవలం ఐదు మాత్రమే పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 65,662 పరీక్షలు నిర్వహించగా కేసులేమీ నమోదు కాలేదు. ప్రజలు, ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, స్వీయ పరిరక్షణ పాటించడం ద్వారానే ఇది సాధ్యమైంది. కాకినాడను మలేరియారహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మరిన్ని చర్యలు చేపడుతుంది.

ఉడిమూడి వంతెన నిర్మాణంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు

పి.గన్నవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మంగళగిరిలో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ ద్వారా నిర్మితమవుతున్న మేజర్ వంతెనలు, రహదారుల వివరాలతో కూడిన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడి వద్ద ఏఐబీ నిధులు రూ.49.50కోట్లతో నిర్మితమవుతున్న ఉడిమూడి-పెదపూడిలంక వంతెన నిర్మాణం పనులు, వరదల సమయంలో లంకగ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులను పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు వివరించారు. ఇది పంచాయతీరాజ్ ద్వారా జరుగుతున్న అతిపెద్ద వంతెనగా స్పష్టం చేశారు. దీంతో పవన్‌కల్యాణ్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపినట్లు రాంబాబు తెలిపారు. ప్రదర్శనలో ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, ఈఎన్‌సీ బాలు నాయక్ పాల్గొన్నారు.



మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈ

బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎనిమిది కళాశాలలకు చెందిన 493 మంది విద్యార్థినులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 40 మంది గైర్హాజరయ్యారు. వచ్చే నెల 10వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఎగ్జామినేషన్స్ అబ్జర్వర్‌గా డాక్టర్ లావణ్య, చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శశి, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శ్రీనివాస్ వ్యవహరిస్తున్నారు. ఇన్విజిలేటర్లుగా వివిధ ప్రాంతాలకు చెందిన 18 మంది ఉద్యోగులు పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు డాక్టర్ శశి తెలిపారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థినులు →





విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న సమగ్ర శిక్షా ఏపీసీ వేణుగోపాలరావు

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు

ముగ్గురు విద్యార్థుల ఎంపిక

సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా, స్పెషల్ ఒలింపిక్స్ భారత్ సంయుక్తంగా ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లిలో ప్రత్యేక అవసరాల (సీడబ్ల్యుఎస్ఎన్) విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆటల పోటీల్లో కాకినాడ జిల్లా నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. కాకినాడలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో గురువారం నిర్వహించిన అభినందన సభలో జాతీయ పోటీలకు ఎంపికైన జి.సురేష్‌కుమార్ (రన్నింగ్), కె.సత్యదుర్గ పెదరాజు (బోసే గేమ్), కె.ప్రేమ్‌కుమార్ (రన్నింగ్)లను అదనపు పథక సంచాలకుడు పి.వేణుగోపాలరావు అభినందించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందించి సత్కరించారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కో-ఆర్డినేటర్, సీఎంవో చామంతి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలకు అరుదైన గుర్తింపు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవం సందర్భంగా ఐపీ, సంగీతం-ఫీల్ ద బీట్ ఆఫ్ ఏపీ విభాగంలో ప్రతిష్టాత్మకమైన ఏపీఎస్‌సీహెచ్ఈ రాష్ట్రస్థాయి అవార్డును తమ కళాశాల దక్కించుకుందని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం కింద కళాశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులు రూపొందించిన అత్యుత్తమ కళాశాల ఆడియో విజువల్ ప్రదర్శనకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందని ఆయన పేర్కొన్నారు.

ఏలేరులో స్నానానికి దిగి..

అమ్మమ్మ, మనవడు మృతి

● ఏలేశ్వరం మండలంలోని యర్రవరం ఏలేరు కాలువ వద్ద ఘటన

● మృతులది ప్రత్తిపాడులోని ఏగులమ్మ గుడి ప్రాంతం



ఏలేరులో స్నానాలకు దిగి మృతి చెందిన అమ్మమ్మ మనవడు



అరట్లకోట సత్యవతి, గోర్స వీరమనోజ్(ఫైల్)

ఏలేశ్వరం/ప్రత్తిపాడు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ప్రత్తిపాడుకు చెందిన అమ్మమ్మ, మనవడు బుధవారం ఏలేశ్వరం మండలంలోని యర్రవరం ఏలేరు కాలువలో దిగి ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెందారు. ఇద్దరు మృతి చెందారన్న విషయం గురువారం ఉదయం తెలియడంతో ప్రత్తిపాడులో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ప్రత్తిపాడు ఏగులమ్మ గుడి సమీపంలో ఉంటున్న అరట్ల కోట సత్యవతి(50), గోర్స వీర మనోజ్(12) అమ్మమ్మ, మనవడు. వీరిద్దరూ పొద్దుపోయిన తర్వాత యర్రవరం ఏలేరునదిలో స్నానం ఆచరించేందుకు ప్రత్తిపాడు నుంచి బయల్దేరి వెళ్లారు. ఏలేరు నది ఒడ్డున చెప్పులు వదిలి స్నానం చేసేందుకు దిగిన వీరు ఊబి ఉన్న ప్రాంతంలో దిగడంతో ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. వీరి ఆచూకీ కోసం బంధువులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. గురువారం ఉదయం ఏలేశ్వరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో 11గంటల సమయంలో ఏలేరు నది వెంబడి గాలింపు చర్యలు చేపట్టగా సత్యవతి, మనోజ్ మృతదేహాలు లభ్యమయ్యాయి. వాటిని ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. సత్యవతి అమ్మవారి ఆలయం వద్ద సేవ చేస్తూ ఉంటుందని భర్త నాగేశ్వరరావు తెలిపారు. మనోజ్ 5వ తరగతి చదువుతున్నట్లు తండ్రి నాగేశ్వరరావు తెలిపారు. బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రత్తిపాడులో విషాదఛాయలు

ప్రత్తిపాడులోని ఏగులమ్మగుడి సమీప ప్రాంతానికి చెందిన అరట్లకోట సత్యవతి, మనవడు గోర్స వీర మనోజ్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరి మృతి సమాచారం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలు సత్యవతి, భర్త నాగేశ్వరరావుకు ముగ్గురు ఆడపిల్లలు. వీరిలో వెంకటరమణమ్మ, రాజుల దంపతుల కుమారుడు గోర్స వీర మనోజ్. అమ్మమ్మ చేరికలో ఉండడంతో బాలుడు ఏలేరు నది స్నానానికి తీసుకెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోవడంతో గ్రామస్తులను తీవ్రంగా కలిచివేసింది. వేగలమ్మ ఉత్సవాలకు గురువారం పందిరి రాటవేసి శ్రీకారం చుట్టే సన్నాహాలు జరుగుతుండడంతో వీరు ఏలేరులో స్నానం ఆచరించడానికి వెళ్లి మృత్యువాత పడడం గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి ప్రాంతం కుటుంబీకుల రోదనలతో విషాదం అలుముకుంది.

రాజమహేంద్రవరంలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్

» రెండు ఎకరాల స్థల సేకరణకు నిర్ణయం

» ఈ హబ్‌తో పారిశ్రామికవేత్తల గుర్తింపు

» హబ్ సభ్యులతో కలెక్టర్ ప్రశాంతి తొలి సమావేశం



సమావేశంలో పారిశ్రామికవేత్తలు, అధికారులతో మాట్లాడుతున్న తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్(ఆర్టీఐహెచ్) ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, దీని కోసం రెండు ఎకరాల భూమిని కూడా సేకరించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆర్టీఐహెచ్ సభ్యులతో తొలి సమావేశం నిర్వహించారు. ఇందులో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, గ్రీన్ కోర్, ఓఎన్జీసీ, గెయిల్, ఇతర ఇన్నోవేటివ్ ఏజెన్సీలు, ఎన్ఐటీఏ, జేఎన్‌టీయూ ఎక్స్‌పెర్ట్ టీమ్, పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, ఇతర సమన్వయ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలనే సీఎం నారా చంద్రబాబునాయుడు ఆలోచనకు అనుగుణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యాచరణ లక్ష్యంగా గుర్తించిన వ్యక్తులను పరిజ్ఞానాన్ని అందించి, ఆలోచనల నుంచి నూతన ఆవిష్కరణలు చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో రాజమహేంద్రవరం, విశాఖ, తిరుపతి, ఎన్టీఆర్ జిల్లా, అనంతపురం జిల్లాల్లో ఈ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో సరైన దిశా నిర్దేశం చేయడంతోపాటు వారికి తగిన నాలెడ్జి అందించాలన్నారు. బోర్డ్ కోర్ కమిటీ గవర్నింగ్ వ్యవస్థకు గ్రీన్‌కోర్ సీఈవో, ప్రమోటర్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. సహ ప్రమోటర్‌గా ఓఎన్జీసీ, గెయిల్, అవంతి తదితరులు, ఎక్స్‌పెర్ట్ కమిటీ సభ్యులుగా జేఎన్‌టీయూ, జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సభ్యులు వ్యవహరిస్తారన్నారు. సాంకేతిక పురోగతి, మార్కెట్ మార్పులు, స్టార్టప్‌ల అభివృద్ధి, అవసరాల నుంచి ఉత్పన్నమయ్యే అవకాశాలను ఉపయోగించుకోవడానికి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. జిల్లా పరిధిలో ఫుడ్, ఆక్వా, అగ్రికల్చర్, అగ్రి వ్యర్థాలు, పామ్ ఆయిల్, కోకో, పెప్పర్, పూలు, మొక్కలు ఆధారిత యూనిట్లు, సేవారంగం, జీడిపప్పు పరిశ్రమ తదితర అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఎ.గోపాలకృష్ణ, ఎన్ఐటీఏ డైరెక్టర్ జి.రవి కిరణ్ శాస్త్రి, గ్రీన్‌కో సీఈవో పి.రాంబాబు, ఐటీయూ అండ్ సీ-ఓఎస్‌డీ ఆర్.దీప్తి, గెయిల్ అధికారి డి.ప్రభాకర్, ఓఎన్‌జీసీ అధికారి జి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఆర్ఎంసీ నుంచి కొండలరావు, మెప్మా శ్రీదేవి పాల్గొన్నారు.

గంజాయితో నలుగురి అరెస్టు

● రెండు కిలోల గంజాయి, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం



రాయవరం పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘువీర్

రాయవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తుల నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్ తెలిపారు. గురువారం రాయవరం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా రాయవరం మండలం పసలపూడి శివారు బండిరేవు పుంత వద్ద నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంపై మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు ఆధ్వర్యంలో రాయవరం ఎస్‌ఐ డి.సురేష్‌బాబు దాడిచేసి బండిరేవు పుంతవద్ద ప్లాస్టిక్ కవర్లతో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రామచంద్రపురం పట్టణానికి చెందిన కొగరు రామతేజ, మణిపూడి శ్రీసాయి వెంకటేశ్వరరావు, పసలపూడి గ్రామానికి చెందిన చిటికెన కల్యాణవెంకట కుమార్, సత్తి దుర్గా ప్రసాదరెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నలుగురు వ్యక్తులు చెడు వ్యసనాలకు బానిసై గంజాయి తాగడానికి అలవాటు పడటంతోపాటు ఈజీగా డబ్బు సంపాదించాలనే ఆశతో దారకొండ ఏజెన్సీ నుంచి కిలో గంజాయి సుమారు రెం డువేలకు కొనుగోలుచేసి రూ.10వేలకు విక్రయాలు సాగిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి కొనుగోలుచేసి అమ్మకాలు సాగించేందుకు తెచ్చిన గంజాయిని పంప కాలు చేసే సమయంలో నలుగురినీ అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు సాగుతుందని మరో నలుగురు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌ఐ సురేష్‌బాబు తెలిపారు.

తుని మున్సిపాలిటీపై

టీడీపీ పాగాకు ముహూర్తం ఫిక్స్

● 28న ఎన్నిక ప్రక్రియ

తుని రూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుని మున్సిపాల్టీపై టీడీపీ పాగాకు ముహూర్తం ఫిక్స్ అయింది. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 28న ఈరెండు పదవులకు ఎన్నిక లాంఛన ప్రాయమే. 30మంది సభ్యులుగల తుని మున్సిపాల్టీలో టీడీపీ సంఖ్యా బలం 17. దీంతో చైర్మన్, వైస్ చైర్మన్లు ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ల అభ్యర్థుల ఎంపికపై మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబుతో తేటగుంట క్యాంప్ కార్యాలయంలో సమావేశమయ్యారు. చైర్మన్‌గా నార్ల భువనేశ్వరి, వైస్‌చైర్మన్‌గా ఆచంట సురేష్ పేర్లపై కౌన్సిలర్లు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు యనమలకు కౌన్సిలర్లు ఏకాభిప్రాయం తెలియజేశారు. పట్టణ నేతలకు దిశానిర్దేశం చేసిన యనమల రామకృష్ణుడు అందరూ సమిష్టి నిర్ణయంతో జయభేరి మోగించాలన్నారు. ఇన్‌చార్జ్ చైర్మన్ కుచ్చర్లపాటి రూపాదేవి, మాజీ చైర్మన్లు యినిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, సత్యనారాయణ, సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, నార్ల రత్నాజీ, దంతులూరి శ్రీనివాసరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



యనమలతో సమావేశమైన తుని మున్సిపల్ కౌన్సిలర్లు

ధ్రువపత్రాల పరిశీలన

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వైద్య కారణాల కిం ద బదిలీలు కోరుకునే ఉపాధ్యాయులకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యా యులకు కాకినాడ జీజీహెచ్‌లో గురువారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. 192మంది వైద్య ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారు. వారిని వివిధ విభాగాల వైద్యులు పరీక్షించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీఆర్ విఠల్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, అడ్మినిస్ట్రేటర్ ఎన్.శ్రీధర్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య పర్యవేక్షించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని

యువకుడి మృతి



లోవరాజు మృతదేహం

శంఖవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): కాసేపట్లో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో ఆనందంగా ఉండాల్సిన యువకుడిని మృత్యువు కబళించింది. ఆ ప్రమాదం యువకుడి ఇంట శోకాన్ని మిగిల్చింది. శంఖవరం మండలం వేళంగి పంచాయతీ పరిధి ధారమల్లాపురం గ్రామానికి చెందిన ఆపూరి లోవరాజు(22) గురువారం బైక్‌పై ఇంటినుంచి రౌతులపూడి వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా ప్రత్తిపాడు మండలం కొత్త అచ్చింపేట సమీపంలో విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా తలకి బలమైన గాయాలవడంతో అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. దీనిపై అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

బాలుడిని కిడ్నాప్ చేసిన వ్యక్తి అరెస్ట్



జి.వేమవరంలో కిడ్నాపర్‌ని అరెస్టు చేస్తున్న ఎస్‌ఐ

తాళ్లరేవు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం జి.వేమవరంలో బాలుడు ఫణివర్ధన్‌ని కిడ్నాప్ చేసిన చొల్లంగిపేటకు చెందిన కుంది అబద్దాలును అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ గురువారం తెలిపారు. సదరు అయిన విల్లి కాళీకృష్ణభగవాన్ గత 3 సంవత్సరాల క్రితం కుంది అబద్దాలు వద్ద రూ.1,20,000 అప్పుగా తీసుకున్నాడు. ఈ డబ్బులను రాబట్టేందుకు కుంది అబద్దాలు కాళీకృష్ణ భగవాన్ రెండవ కుమారుడు ఫణివర్ధన్‌ను కిడ్నాప్ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌కు ఫిర్యాదు చేశారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కోరింగ ఎస్‌ఐ పి.సత్యనారాయణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి విచారణ చేపట్టారు. ఫణివర్ధన్‌ని కిడ్నాపర్ నుంచి రక్షించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కిడ్నాపర్‌ని అరెస్ట్‌చేసి రిమాండ్‌కి పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేబ్రోలులో మళ్లీ డయేరియా

కొత్తగా పది కేసులు

ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ అధికంగా రోగులు



చేబ్రోలు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకి నాడజిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మళ్లీ డయేరియా జాడలు కనిపిస్తున్నాయి. పీహెచ్‌సీతో పా టు ప్రైవేటు ఆసుపత్రులకు వాంతులు, విరోచనాలతో చికిత్స పొందుతూ రోగులు అధికంగా వస్తున్నారు. చేబ్రోలు పీహెచ్‌సీలో ఐదుగురు రోగులు చికిత్స పొందారు. ఇంటింటా సర్వైలెన్స్‌లో మరో ఐదు కేసులను గుర్తించారు. వీరుగాక ప్రైవేటు ఆసుపత్రుల్లో పది మందికిపైగా రోగులు చికిత్స పొందుతున్నారు. డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చిందని డీఎంహెచ్‌వో ప్రకటించి 24 గంటలు గడవక ముందే మరలా డయేరియాతో రోగులు అధికంగా రావడం ఆందోళన కలిగిస్తోంది. డయేరియా ప్రబలడానికి అసలు కారణాన్ని అధికారులు గుర్తించకపోవడమే ప్రధానకారణంగా భావిస్తున్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

రూ.5లక్షల ఆస్తి నష్టం

ముమ్మిడివరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం ఠాణేలంక పంచాయతీ పరిధిలోని బలుసుల్లంకలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిల్లు దగ్ధమై రూ.5లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ ప్రమాదంలో చిన్నం ప్రసాదరావుకు చెందిన తాటాకిల్లు కాలి బూడిదైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కొండబాబు తెలిపారు. వ్యవసాయ కూలీ పనులకు చిన్నం ప్రసాదరావు, అతని భార్య వెళ్లగా కుమారులు ఇరువురు తాపీ పనులకు వెళ్లిపోయారు. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేకపోవడంతో చుట్టుపక్కల వారు గుర్తించేసరికే మంటలు చుట్టుముట్టడంతో ప్రమాదంలో సర్వం కాలి బూడిదయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో బయటపడ్డారు. ప్రమాదంలో రూ.60వేలు నగదు, బంగారపు వస్తువులు, గ్యాస్, విద్యుత్ మీటరు, గృహోపకరణాలు మొత్తం ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. ముమ్మిడివరం ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి కేవీ మురళీకొండబాబు, నారాయణలతోపాటు సిబ్బంది పాల్గొని మంటలు అదుపు చేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నా ప్రాణాలకు ముప్పు ఉంది

● రక్షణ కల్పించండి

● సామర్లకోట పోలీసులకు ఫిర్యాదు

సామర్లకోట, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పనసపాడు గ్రామంలో నివసిస్తూ ఫణి గ్యాసెస్ సంస్థలో పనిచేస్తున్న సజ్జా రాము అనే వ్యక్తిపై మరొక గ్యాస్ కంపెనీకి చెందిన అభి, అనిల్, గంగాధర్‌రావు, మహేష్ అనే నలుగురు వ్యక్తులు తన ఇంటికి వచ్చి తన అంతుచూస్తామని బెదిరించడంతో తన ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని సామర్లకోట పోలీసులకు గురువారం ఫిర్యాదుచేశారు. ఇక్కడ లోకల్‌గా ఉన్న గ్యాస్ కంపెనీలు నిర్వహిస్తున్న తమకు నాన్‌లోకల్ అయిన మోహనరావు కంపెనీ వ్యాపారాల వలన తమ వ్యాపారం కుంటుపడుతుందని పేర్కొంటూ తనను బెదిరించి నట్లు పోలీసులకు తెలిపారు. తన ప్రాణాలకు రక్షణ కల్పించి తనను బెదిరిస్తున్న వారి నుంచి తనకు శాశ్వత రక్షణ కల్పించాలని సీఐకు అందించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫణి గ్యాస్ కంపెనీ అధినేత మోహనరావు కూడా ఫిర్యాదు అందజేసిన వారిలో ఉన్నారు. కాగా ఆరోపణలకు గురైన వారిని స్టేషన్‌కు పిలిపించి సీఐ కౌన్సెలింగ్ నిర్వహించి ఎవరివ్యాపారాలు వారు చేసుకోవాలని సీఐ కృష్ణభగవాన్ హెచ్చరించారు.



పిఠాపురం పట్టణం అగ్రహారంలో నిర్వహిస్తున్న కబేళాకు తాళాలు వేస్తున్న మునిసిపల్ కమిషనరు కనకారావు, సిబ్బంది

అగ్రహారంలో కబేళా మూసివేత


● హైకోర్టు ఆదేశాలతో మునిసిపల్ అధికారుల చర్యలు

పిఠాపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని అగ్రహారంలో కబేళాకు ఎట్టకేలకు తాళాలుపడ్డాయి. నివాస ప్రాంతాల మధ్య పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఉన్న జంతు వధశాలను మూసివేయాలని కలెక్టర్, హైకోర్టు ఆదేశించినా మునిసిపల్ అధికారులు అమలు చేయట్లేదంటూ కాకినాడకు చెందిన యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ ప్రతినిధి గోపాలరావు హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు చేశారు. రెండు రోజుల్లో కబేళాను మూసివేయాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో కమిషనర్ కనకారావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది గురువారం కబేళాకు తాళాలు వేసి దానిని మూసివేస్తున్నట్టు నోటీసులు అంటించారు.

రెండు కుటుంబాల మధ్య

వివాదం

● నలుగురికి గాయాలు



గాయపడ్డ మల్లాడి చినవీర్రాజు

కాట్రేనికోన, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం మత్స్యకార గ్రామంలో రెండు కుటుంబాల మధ్య జరిగిన గొడవలో నలుగురు గాయపడ్డారు. పంచాయతీ పరిధిలోని కుళాయిలవద్ద నీరు పట్టుకుని ఇంటికి వెళుతున్న సమయంలో మహిళలు ఒకరిని ఒకరు దూషించుకోవడంతో ఇరు కుటుంబాల మధ్య గురువారం వివాదం చోటుచేసుకుంది. ఈ వివాదం నేపథ్యంలో మల్లాడి చినవీర్రాజు, మల్లాడి లక్ష్మణ్ కుటుంబాలు కొట్లాటకు దిగాయి. ఈ కొట్లాటలో మల్లాడి చినవీర్రాజువర్గంలో చినవీర్రాజు, లక్ష్మణ్ వర్గంలో మల్లాడి ధర్మారావు, మల్లాడి ధనావతి, మల్లాడి లక్ష్మణ్ గాయపడినట్టు ఎస్‌ఐ అవినాష్ తెలిపారు. గాయపడిన వారు ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి ఈనెల 23వ తేదీ నుంచి కనిపించడంలేదని త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం సీతంపేటకు చెందిన 20 ఏళ్ల యువతి ఇంటి వద్ద ఉంటుంది, ఈ క్రమంలో ఇంటి నుంచి బుధవారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈమేరకు ఆ యువతి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు

● 12 గ్రాముల బంగారం స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు జీరో పాయింట్‌వద్ద ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం.. దివాన్‌చెరువు గ్రామ సమీపంలో ఈనెల 10న ఒక మహిళ రోడ్డుపై నడిచి వెళుతుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆమె మెడలో బంగారు వస్తువులను లాక్కెల్లారు. ఈ సంఘటనలో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు. ఈ చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడింది ఒడిస్సాకు చెందిన పాత నేరస్తుడు కె.సూర్యారావు, అల్లూరిజిల్లాకు చెందిన ఉమాశంకర్ అని పోలీసులు గుర్తించారు. వారిని గురువారం అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 12 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. కె. సూర్యారావు, ఉమాశంకర్‌లపై గంజాయి, చెయిన్ స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ప్రేమపేరుతో మోసం చేశాడని యువతి ఫిర్యాదు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరం దేవీచౌక్ సమీపంలో ఎస్కే కోచింగ్ సెంటర్‌లో కాంపిటేటివ్ పరీక్షలకు శిక్షణ పొందుతున్న ఎస్.రాంబాబు అనే యువకుడు తనను వివాహం చేసుకుంటానని చెప్పి ప్రేమపేరుతో మోసం చేశాడని బాధిత యువతి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. దేవపల్లికి చెందిన 20 ఏళ్ల యువతి రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో ఉన్న ఎస్కే కోచింగ్ సెంటర్‌లో పోటీ పరీక్షలకు శిక్షణకోసం 2022 నుంచి వచ్చి వెళుతుంది. ఈ క్రమంలో విజయనగరానికి చెందిన రాంబాబుతో పరిచయం ఏర్పడింది. దీంతో తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రేమించాడని తన అవసరం తీరాక రాంబాబు పెళ్లి చేసుకోనని మొఖం చాటేశాడని నిలదీస్తే కులం పేరుతో అవమానించాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో


దింపు కార్మికుడి మృతి



కోలా ధనరాజు (ఫైల్)

చాగల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలంలోని చిక్కాలలో కొబ్బరి దింపు కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్‌ఐ కె.నరేంద్ర తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన కోలా ధనరాజు (22) తోటి కొబ్బరి కాయల దింపు కార్మికులతో కలిసి పనికి వెళ్లాడు. కొబ్బరి చెట్టు నుంచి కాయలు దింపుతుండగా అతనే నరికిన కొబ్బరి ఆకు ప్రక్కన ఉన్న విద్యుత్ తీగలపై పడి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కార్మికులు అతనిని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయిన ట్లు వైద్యులు చెప్పారు. ఈ విషయమై మృతుడు అన్నయ్య శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మృతుడుకి ఇంకా వివాహం కాలేదు.

రైలు నుంచి జారిపడి మహిళ మృతి



రైలు నుంచి జారిపడి మృతి చెందిన మహిళ

తునిరూరల్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. రైల్వే ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకా రం.. నరసింగపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మహిళ రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన మహిళ వయస్సు 35ఏళ్లు ఉంటుందని, మృతురాలి వద్ద ఏ ఆధారాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతురాలు వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీసులకుగాని సంబంధిత ఫోన్ నెంబర్ 94906 19020గాని సంప్రదించాలని కోరారు.

రహదారుల పనులు త్వరగా పూర్తిచేయాలి

అధికారులతో కలిసి నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే బత్తుల



రహదారి పనులపై అధికారులను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఆర్ అండ్‌బీ రహదారుల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలో పలు గ్రామాలను కలుపుతూ జరుగుతున్న ఆర్‌అండ్‌బీ రహదారుల పనులను ఆయన గురువారం పరిశీలించారు. రాజానగరం-అనపర్తి రోడ్డు నిర్మాణంలో భాగంగా మల్లంపూడి, ముక్కినాడ గ్రామాల్లో జరుగుతున్న పనులను, రాజవోలు-కేశవరం రోడ్డు నిర్మాణంలో భాగంగా కొండగుంటూరు, సంపత్‌నగరం గ్రామాల్లో జరుగుతున్న పనులను సంబంధిత అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో చేపట్టిన అరకొర పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో ముందుకు రాలేకపోతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సత్రం భూముల వేలం రద్దు చేయాలి

- కాంగ్రెస్ పార్టీ రాజానగరం అధ్యక్షుడు శ్రీనివాస్ నిరసన దీక్ష
- దీక్షకు అనుమతి లేదంటూ శిబిరాన్ని తొలగించిన పోలీసులు

రాజానగరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): దేవదాయ ధర్మాదాయశాఖ అధీనంలోని రాజానగరంలోని అన్నదాన సత్రం భూముల్లో పంటల సాగుకు సంబంధించి ఇటీవల జరిగిన వేలం పాటను రద్దు చేసి, తిరిగి వేలం నిర్వహించాలంటూ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముప్పిడి శ్రీనివాస్ గురువారం అన్నదాన సత్రం సమీపంలో నిరసన దీక్షకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తూర్పుగోనగూడెం పరిధిలో కలవచర్ల రోడ్డును ఆనుకుని ఉన్న 25.16 ఎకరాల్లో మూడేళ్ల పాటు సాగుచేసుకునేందుకు ఈ నెల 14న నిర్వహించిన బహిరంగ వేలంలో పాటదారులు కుమ్మక్కై ఏడాదికి రూ.15.16 లక్షలు వంతున మూడేళ్ల పాటు సాగు చేసుకునేవిధంగా పాటను చేజిక్కించుకున్నారన్నారు. దశాబ్దాల తరబడి సదరు భూములను సాగు చేసుకుంటూ నామ మాత్రపు లీజు కూడా చెల్లించకుండా అక్రమంగా అనుభవిస్తున్న వారికి బంధువులకే వేలం కట్టబెట్టారన్నారు. దీనిని రద్దు చేసి, తిరిగి వేలం నిర్వహించాలని డిమాండ్ చేశారు. కాగా దీక్ష సమాచారం అందుకున్న పోలీసులు శిబిరం వద్దకు చేరుకున్నారు. అనుమతి లేనిదే నిరసన దీక్ష చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామంటూ శిబిరాన్ని తొలగించారు. దీంతో శ్రీనివాస్ అనుమతి పొందిన తదుపరి దీక్ష చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

మెసెంజర్ బాగోతాలు బయటపెడితే భరత్‌నాట్యమే

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): సిగ్నల్ ప్రైవేట్ మెసెంజర్ యాప్ ద్వారా గతంలో మాజీ ఎంపీ భరత్‌రామ్ నడిపిన బాగోతాలు బయటపెడితే భరతనాట్యం ఆడేస్తారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు ఆరోపించారు.రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భరత్ తన స్థాయి మరచి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుపై అవ్వాకులు చవ్వాకులు పేలితే పద్ధతిగా ఉండదన్నారు. చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా మాట్లాడుతూ ఐదేళ్ల పాటు భరత్ గాడిదలు కాస్తే.. తమ ఎమ్మెల్యే కొద్ది నెలల్లో ప్రభుత్వాసుపత్రిలో మార్చురీ సమస్యలకు పరిష్కారం చూపారని, ఫ్రీజర్లు, ఆర్వో ప్లాంట్లు పెట్టించారన్నారు. యిన్నమూరి దీపు మాట్లాడుతూ నెలలో 15 రోజులు టూరుకు పోయి వచ్చే భరత్ నగరంపై కనీస అవగాహన లేకుండా ఉనికి కోసం తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు నమ్మరన్నారు.సమావేశంలో మరుకుర్తి రవియాదవ్, పోలాకి పరమేష్, మళ్ళ వెంకట్రాజు, కరగాని వేణు, సీహెచ్ఎస్ఎన్ మూర్తి, సనపత్తి సత్తిబాబు, ఈతలపాటి రవి పాల్గొన్నారు.

ప్రజలపై కూటమి పెనుభారాలు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి.. ఇంటి పన్నులు తగ్గించాలంటూ ధర్నా



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 15శాతం పెంచిన ఇంటి పన్నులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ధర్నా చేసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రజలపై పెనుభారాలు మోపుతున్నారని, ఎన్నడులేని విధంగా ఇంటి పన్ను 15శాతం పెంచడం దారుణమన్నారు. ఎప్పటిలాగే ప్రతీ సంవత్సరం 5శాతం మాత్రమే పన్ను పెంచాలన్నారు. అదేవిధంగా కరెంట్ చార్జీలు కూడా పెంచారని ఇప్పటికే చార్జిల రూపంలో రూ.17వేల కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. స్మార్ట్ మీటర్ల పేరుతో స్కామ్‌ల సూత్రధారి ఆదానీని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్‌లూథర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోతా శారద, డాక్టర్ వడయార్, అబ్దుల్లా షరీఫ్, బెజవాడ రంగారావు, వై.శ్రీనివాస్, మేడవరపు భద్రందొర, దేవత సుధాకర్, తాడాల కొండ్రాజు, బిల్డర్ బాబి, శాక పుల్లారావు, ఎండీ షహేన్‌షా, దెయ్యాల రాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుప్పలపూడి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్టు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.నిరంజన్‌బాబు గురువారం తెలిపారు. దీంతో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అనపర్తి జీబీఆర్ కళాశాల ఏరియా, ఇందిరా నగర్, సునందపేట, మార్కెండేయపురం, మార్కెట్, శేషగిరిరావు పేట, వెంకటరత్నపురం, మెయిన్ రోడ్డు కెనాల్‌రోడ్డు, ద్వారపూడి రోడ్డు, కొప్పవరం, ఎల్ఎన్‌పురం, దుప్పలపూడి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈఈ తెలిపారు.

కోరుకొండ: ఉదయం 7నుంచి మధ్యాహ్నం 1గంటవరకు కోరుకొండ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం పశ్చిమగోనగూడెం, జంబూపట్నం, కాపవరం, శ్రీరంగపట్నం, మునగాల, కోటి, కోటికేశవరం, బొల్లేద్దుపాలెం, గాదరాడ, కణుపూరు, రాజవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తారని ట్రాన్స్‌కో ఈఈ దాట్ల శ్రీధర్ వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

సీతానగరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని భూమిలేని నిరుపేదలకు పంచాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పలివెల వీరబాబు ఆధ్వర్యంలో నాయకులు, మహిళలు పెద్దఎత్తున గురువారం ర్యాలీ నిర్వహించారు. చినకొండేపూడిలోని పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా చినకొండేపూడి బందిలదొడ్డి నుంచి సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల్లో వందలాది ఎకరాలు భూస్వాముల చేతుల్లో ఉంటున్నాయని, అధికారులు సర్వే చేసి అన్ని కులాల్లోని నిరుపేదలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు పలివెల జ్యోతి, మండల మహిళా అధ్యక్షురాలు ఖడిదల రాధ, సీతానగరం అధ్యక్షుడు సిద్ది నాగరాజు, జిల్లా కమిటీ మెంబరు నందమూరి చిట్టితోపాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

కోరుకొండలో కోదండ రామాలయ పునః ప్రతిష్ఠ



కోదండ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలోని కోదండ రామాలయంలో స్వామివారి విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. వైసీపీ కేంద్ర కమిటీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కోదండ రామాలయ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనడం పూర్వ జన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఇస్కాన్' నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మానవతా విలువలు, ఆధ్యాత్మిక విలువలు దిగజారిపోతున్నాయని ఇస్కాన్ వ్యవస్థాపకుడు శ్రీ ప్రభుపాదుల వారు తెలిపినట్టు రాజమండ్రి ఇస్కాన్ ప్రతినిధి శ్యామానంద ప్రభు చెప్పారు. గురువారం ప్రక్కిలంకలో నిర్మించే ఇస్కాన్ టెంపుల్‌కు భూమిపూజ చేశారు. ఇస్కాన్ భక్తులు , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి

అత్యంత హేయం

- ఉగ్రవాద వ్యతిరేక ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కాండ్రేగుల శంకర్
- పలు చోట్ల కొవ్వొత్తుల ర్యాలీలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ-కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత హేయమని రాష్ట్ర ఉగ్రవాద వ్యతిరేక ఫ్రంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాండ్రేగుల శంకర్, ధర్నాలకోట వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఉగ్రవాదుల దుర్మార్గపు చర్యకు నిరసనగా రాష్ట్ర ఉగ్రవాద ఫ్రంట్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రాజేంద్రనగర్ పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫ్రంట్ రాష్ట్ర ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులతో అమరులైన వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. కార్యక్రమంలో డీఎస్ రాజేశ్వరరావు, ధర్నాటకోట శ్రీనివాసరావు, రెల్లి సూరిబాబు, సోఫియా, పి.నాగబాబు, కె.సాయిరాం పాల్గొన్నారు. గురువారం ఉదయం వెంకటేశ్వరనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు శాంతి ర్యాలీ నిర్వహించి, అమరులైన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, భానుప్రసాద్, వాసు, సుబ్బారావు పాల్గొన్నారు. అమాయక పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తుదముట్టించాలని, అమరులైన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆయన నాయకత్వంలో స్థానిక కోటిపల్లి బస్టాండ్ జంక్షన్ వద్ద పార్టీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించి ఉగ్రవాదుల చేతిలో అశువులు బాసిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. మాజీ మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ పర్యాటకులపై దాడి చేయడం అమానుషమని, దీనిని వైసీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి పొట్టన పెట్టుకోవడం దారుణమన్నారు.రాజమహేంద్రవరంలోనే కాక, రాష్ట్రంలోని అన్ని చోట్లా వైసీపీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించాయన్నారు. కార్యక్రమంలో ఆకుల వీర్రాజు, మేడపాటి షర్మిళారెడ్డి, నందెపు శ్రీను, తోట రామకృష్ణ, అడపా అనిల్, తలారి వెంకటేశ్వరరావు, అన్ని నియోజక వర్గాల నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న జీఎస్ఎల్ విద్యార్థులు



కోరుకొండలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

వైద్య విద్యార్థుల నిరసన..

రాజానగరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దురాగతాలకు నిరసనగా రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థలు ఆధ్వర్యంలో గురువారం రాత్రి వైద్య విద్యార్థులు కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మెడికల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో అఖండ భారతదేశం ఆకృతిలో కొవ్వొత్తుల ప్రదర్శనలో కొలువుదీరారు. మనం భారతీయులం-మనది అఖండ భారతం అనే నినాదంతో హిందీ, ఇంగ్లీషు, తమిళ, మళయాళీ, ఒరియా, బెంగాళీ తదితర భాషల్లో ఉవ్వెత్తున నినదించారు. ఈ సందర్భంగా జీఎస్ఎల్ సంస్థల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ దేశ సమగ్రతకు సమైక్యతకు భంగం కలిగిస్తున్న తీవ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు దేశమంతా సంఘీభావం ప్రకటిస్తుందన్నారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్, మెడికల్ సూపరింటెండెంట్, డెంటల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు తదితరులు మృతుల కుటుంబాలకు సంతాపం, కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావాన్ని తెలియజేశారు. వైద్య విద్యార్థుల మానవహారం ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎమ్మెల్యే బత్తుల ఆధ్వర్యంలో..

కోరుకొండ, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్ము కాశ్మీర్ ఉగ్రవాదుల దాడికి నిరసనగా కోరుకొండలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో జనసైనికులు, వీర మహిళలు, కూటమి నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు విద్యార్థులతో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ తీవ్రవాదులు నశించాలని నినాదాలు చేశారు. పెహల్గామ్‌లో ఉగ్రదాడిలో మరణించిన వారిని ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉగ్రదాడి పిరికిపంద చర్య

గోకవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): జమ్మూ-కశ్మీరులోని పహల్గంలో పర్యాటకులపై చేసిన దాడి పిరికిచర్య అని ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు జుహనీ హాలోనెన్ అన్నారు. గోకవరంలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో ప్రాంతాలు, భాషలు, మతాలు సాంప్రదాయాలు వేరైనా ప్రజలంతా ఒక్కటేనన్నారు. నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఉగ్రవాద దాడిలో మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

స్థానిక పాలనలో పంచాయతీలు కీలకం

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో రంగంపేట ఎంపీడీవో సాయిబాబు



బిక్కవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో, కూటమి నాయకులు

రంగంపేట, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించడంలో పంచాయతీరాజ్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తాయని ఎంపీడీవో సాయిబాబు అన్నారు.జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పలుచోట్ల గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి ఎంపీడీవో ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ చట్టం 1993 ఏప్రిల్ 24 నుంచి అమల్లోకి వచ్చిందని, దీని ప్రకారం పంచాయతీలను బలోపేతం చేయడానికి 29 అధికారాలు బదలాయించినట్టు చెప్పారు. రంగంపేట, ముకుందవరం సర్పంచ్‌లను అమరావతిలో జరిగే ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ దినోత్సవ సభకు ఆహ్వానించినట్టు చెప్పారు. పంచాయతీ పాలనకు ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో సెక్రటరీ వెలిచేటి శ్రీరామమూర్తి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని నిర్వహించారు. బిక్కవోలు పంచాయతీలో గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీడీవో వి.శ్రీనివాస్, టీడీపీ నాయకుడు పల్లి శ్రీనివాస రెడ్డి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ జరిపారు. డీఎంపీడీవో జాన్‌మిల్టన్,పరిపాలనాధికారి రత్నకుమార్, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాలివ్వడంలేదు

- ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు
- కలెక్టరేట్ వద్ద గ్యాస్ డెలివరీ కార్మికుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్యాస్ డెలివరీ కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గ్యాస్ డెలివరీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడంలేదని, సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. ఎల్పీజీ గ్యాస్ డెలివరీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అడితి సెంటరు నుంచి కలెక్టరేట్ వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. డీఆర్వో టి.సీతారామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్లకు, కార్మికులకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ఏవీ అప్పారావు రోడ్డులోని లేబర్ ఆఫీసుకు వెళ్లి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిస్ట్రిబ్యూటర్లు తమ కమీషన్లను రూ.150కి పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నారని, కార్మికుల వేతనాలు ఎందుకు పెంచరంటూ డిమాండ్ చేశారు. జిల్లాలో చాలా మంది డిస్ట్రిబ్యూటర్లు.. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. గత ఒప్పంద కాలం 2024 డిసెంబరు 31తో ముగిసినప్పటికీ కార్మికులను పట్టించుకుపోవడం దారుణమన్నారు. కార్మికులను పిలిచి సామరస్య ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ శివశరణ్, ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, డి.శ్రీనివాస్, రామకృష్ణ, దొర, నందమూరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు ఉద్యమిద్దాం

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) :అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన మేడే స్ఫూర్తితో 8 గంటల పనివిధానం కాపాడుకోవడంతోపాటు, లేబర్ కోడ్స్ రద్దు కోసం ఉద్యమిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్లోని సీఐటీయూ కార్యాలయంలో మేడే సందర్భంగా ప్రత్యేక కరపత్రాన్ని జిల్లా నాయకత్వం విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మికులను బానిసలుగా మార్చారని, పనిగంటలను 8 నుంచి 12 గంటలకు పెంచాలని చూస్తున్నారని అన్నారు. మేడే స్ఫూర్తితో 8 గంటల పని విధానాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఎస్ఎస్ మూర్తి, పూర్ణిమరాజు, నాయకులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ కౌన్సిల్, ప్యానల్ న్యాయవాదులతో 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.మాధురి, 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ ఇంచార్జి కార్యదర్శి బి.పద్మ గురువారం సమావేశమయ్యారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం అందించడానికి నియమితులైన న్యాయవాదులతో ఆయా కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే డీఎల్ఎస్ఏకి తెలియజేయాలన్నారు. క్రిమినల్ కేసుల్లో బెయిల్ కోసం వేసిన అర్జీలపై ఆరా తీశారు.

దుకాణాలు ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

గోకవరం, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గోకవరం మండలం సింగారమ్మచింత ఆలయం వద్ద ఎంతోకాలం నుంచి నిర్వహించుకుంటున్న దుకాణాలను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు, యథావిధిగా తమ దుకాణాలను నిర్వహించుకునేలా అనుమతి ఇవ్వాలంటూ గురువారం గోకవరంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనకారులు తమకు న్యాయం చేయాలంటూ రెవెన్యూ, పోలీస్‌స్టేషన్‌ల వద్ద ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున రావు మాట్లాడుతూ అటవీ ప్రాంతం మధ్యలో ఉన్న సింగారమ్మచింత ఆలయం వద్ద వట్టికూటి సీతామహలక్ష్మి అనే మహిళతో పాటు మరికొంతమంది తమ పూర్వీకుల కాలం నుంచి అక్కడే నివాసం ఉంటూ ఓపక్క అర్చకత్వం చేస్తూ మరో పక్క దుకాణాలు నిర్వహించుకుంటున్నారన్నారు. గోకవరం మండల పరిధిలో ఉన్న ఈ ఆలయంపై జగ్గంపేట మండలం మల్లిసాలకు చెందిన కొందరు వ్యక్తులు పెత్తనం చెలాయిస్తూ వారిని అక్కడ నుంచి తరిమేందుకు అనేక కుట్రలు చేపడుతున్నారన్నారు. దీనిలో భాగంగానే సీతామహలక్ష్మి దుకాణంపై దాడిచేసి సామాగ్రిని ధ్వంసం చేయడంతో పాటు బంగారం, వెండి, నగదును అపహరించుకుపోయారని ఆరోపించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, తిరిగి అక్కడ దుకాణం ఏర్పాటు చేసుకునే విధంగా బాధితులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని అర్జునరావు హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను రెవెన్యూ, పోలీస్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జగ్గంపూడి రాజా, నాగులపల్లి అచ్చారావు, దిమ్మిటి అప్పారావు, సిద్దబత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'గత ప్రభుత్వం శాంక్షన్ చేసిన పనులే ఇప్పుడు చేస్తున్నారు'

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం శాంక్షన్ చేసిన అభివృద్ధి పనులే ఈ పది నెలల పాటు చేసుకుంటూ వచ్చారే తప్ప కూటమి నాయకుల ఘనత ఏమిలేదని వైసీపీ నాయకుడు మజ్జి అప్పారావు విమర్శించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం చేపట్టిన పనులకు ఇప్పుడు కూటమి ఫ్లెక్సీలు వేసుకుంటున్నారని, వాటిపై ఉన్న శ్రద్ధ మిగిలిన పనులపై లేదని ఆరోపించారు. కూటమి నాయకులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గొప్ప అయితే వైసీపీ నాయకులకు మార్గాని భరత్‌రామ్ గొప్ప అని అన్నారు. నగరంలో రహదారులు గాని, ఎయిర్‌పోర్టు, ఎయిర్‌పోర్టు రోడ్డు ఇలా అనేక అభివృద్ధి పనులు భరత్ చేశారన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు బిల్డర్ చిన్నా, కాటం రజనీకాంత్, తిరగటి దుర్గా, నందం స్వామి, గణేష్, రేవుల నాని, కొమ్మోజు దుర్గారావు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు భరోసా

మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు


రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం చంద్రబాబు భరోసా కల్పిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వేలాది మందికి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్నారని అన్నారు. ఒక్క రాజమహేంద్రవరంలోనే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సీఎం సహాయ నిధి నుంచి 82 మందికి రూ.1కోటి 34 లక్షలు చెక్కులు మంజూరు చేయించి పంపిణీ చేయించారని చెప్పారు. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేస్తూనే మరో పక్క కొన్ని రకాల శస్త్రచికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులలో చికిత్సం చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి సహకరిస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు.

వరాహస్వామి క్షేత్రంలో ధరిత్రీ దినోత్సవం



కోరుకొండ రోడ్డులోని వరాహస్వామి క్షేత్రంలో చందనం మొక్కలు నాటుతున్న ధర్మకర్తలు

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): ధరిత్రి దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక కోరుకొండ రోడ్డులోని శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం,కాలెపు నాగేశ్వరరావు పర్యవేక్షణలో చందనం మొక్కలు నాటారు. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి మంగళశాసనాలతో శ్రీవారి క్షేత్రంలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు ధర్మకర్తలు తెలిపారు. స్వామికి ఎంతో ప్రీతికరమైన చందనం మొక్కలు నాటడం వల్ల ఈ క్షేత్ర పవిత్రత మరింత యినుమడిస్తుందని, పర్యావరణ పరిరక్షణకు కూడా ఈ మొక్కలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీ కిరణ్‌స్వామి, ఉభయ వేదాంత ఆచార్య పీఠం అధ్యక్షుడు ఇంజనీర్ రామానుజం తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు


గరిష్ఠం : 42.0 (గురువారం)

కనిష్ఠం : 26.0



అందాల కశ్మీరం.. ఉగ్రదాడితో కాష్మోరాగా మారిపోయింది.. కాష్మోరా సినిమా చూడాలంటేనే భయపడినట్టు.. ప్రస్తుతం కశ్మీరం వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు.. వేసవి సెలవుల నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ప్రయాణ ఏర్పాట్లు చేసుకున్న వందలాదిమంది తమ టూర్ క్యాన్సిల్ చేసుకుంటున్నారు.. ఆ అందాల రాక్షసిని తిలకించాలంటే ముందు మేం ఉండాలి కదా.. అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు వేస్తున్నారు..

- కాకినాడ,ఆంధ్రజ్యోతి



ప్రకృతి.. వలయం : కశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతం



మంచుకొండలోని సందర్మం: కశ్మీర్ సోనామార్గ్‌లో గురువారం మంచు ఇలా..

అందాల రాక్షసివే.. కశ్మీర్..టెర్రర్

రాజమహేంద్రవరంలో ఓ వ్యాపారి వేసవి సెలవుల్లో కుటుంబంతో సహా కశ్మీర్ వెళ్లాలని ముందే ప్లాన్ చేశారు. ఆరుగురి కోసం ముందే ఫ్లైట్ టిక్కెట్స్, హోటల్స్ బుక్ చేసుకున్నారు. తీరా కశ్మీర్‌లో ఉగ్రవాదులు సృష్టించిన నరమేథంతో అక్కడకు వెళ్లలేక టూర్ క్యాన్సిల్ చేసుకున్నారు.

కాకినాడలో రెవెన్యూశాఖకు చెందిన ఆరుగురు ఉద్యోగులు సెలవుపెట్టి కశ్మీర్‌కు బయలుదేరారు. తీరా ఢిల్లీలో విమానం దిగి ఉదయాన్నే కశ్మీర్‌కు బయలుదేరాలనుకునేలోగా ఉగ్రవాదుల దుశ్చర్యతో కాశ్మీర్ ట్రిప్ రద్దు చేసుకున్నారు. తిరుగు విమానం టికెట్లు ఈనెల 26వ తేదీకి బుక్ చేయడంతో చేసేదిలేక ఢిల్లీలోనే ఉండిపోయారు. మూడు రోజులుగా ఢిల్లీలోనే ఉండిపోయి చుట్టుపక్కల పర్యాటక ప్రాంతాల్లో తిరుగుతున్నారు.

కశ్మీర్‌లో ఉగ్రవాద దుశ్చర్య జరగడానికి ఐదు రోజుల ముందే అక్కడి నుంచి కాకినాడకు వచ్చిన కొందరు పర్యాటకులు జరిగిన సంఘటన తల్చుకుని బెంబేలెత్తిపోతున్నారు. తాము పహల్గాం నుంచి బైరసన్‌కు గుర్రాల్లో వెళ్లామని, అదే ప్రాంతంలో నరమేథం జరిగిందని తెలిసి ఒళ్లు జలదరించిందని కాకినాడ నగరానికి చెందిన కొందరు పర్యాటకులు వివరించారు.

- » ఉగ్రవాదుల దుశ్చర్య
- » పర్యాటకుల్లో గుబులు
- » పలు బుకింగ్‌లు రద్దు
- » టూర్ ఏజెన్సీల గగ్గోలు
- » కొంత మంది ఢిల్లీకి పయనం
- » అక్కడ చిక్కిన టూరిస్ట్‌లు
- » తిరిగి వచ్చేందుకు ఒత్తిడి
- » ఖాళీ అవుతున్న కశ్మీరం

కశ్మీర్‌లోయలోని పహల్గాంలో ఈనెల 22న 26 మంది పర్యాటకులను ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న నేపథ్యంలో కశ్మీర్‌లో ఉన్న పర్యాటకులు ప్రాణభయంతో తిరుగుముఖం పట్టారు. దీంతో చాలావరకు కశ్మీర్ ఖాళీ అయిపోయింది. మరో పక్క అక్కడకు సరదాగా వెళ్లాలని ముందే ప్లాన్ చేసుకున్న అనేక కుటుంబాలు ప్రయాణాన్ని రద్దు చేసుకుంటున్నాయి. ఈ వేసవిలో సరదాగా కశ్మీర్ వెళ్లడానికి ఉమ్మడి జిల్లాలో పలు కుటుంబాలు టూర్ ఏజెంట్లను సంప్రదించి నెల రోజులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకున్నారు. ఇప్పుడు ఉగ్రవాదుల దుశ్చర్యతో కశ్మీర్‌కు వెళ్లాలనుకున్న పర్యాటకులు రద్దు చేసుకుంటున్నారు. దీంతో ఏజెంట్లు గగ్గోలు పెడుతున్నారు.

బుకింగ్‌లు రద్దు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల నుంచి దేశ, విదేశాల్లో వివిధ టూరిస్ట్ ప్రాంతాలకు వెళ్లే పర్యాటకుల కోసం 75 వరకు టూర్ అండ్ ట్రావెల్ ఏజెన్సీలున్నాయి. స్వదేశంలో ఏర్పాట్లకు 42 వరకు సర్వీసులు అందిస్తున్నాయి. ఈనెల, వచ్చే నెలలో కలిపి ఈ రెండు నగరాల నుంచి దాదాపు 170 వరకు వివిధ కుటుంబాలు, గ్రూపులు ఢిల్లీ, కశ్మీర్‌కు బుకింగ్‌లు చేసుకున్నాయి. కానీ ప్రస్తుతం అక్కడకు వెళ్లడం ప్రమాదంతో కూడుకున్నందున వీరంతా తమ పర్యటనలను రద్దు చేసుకుంటున్నారు. కొందరైతే ఆన్‌లైన్‌లో సొంతంగా చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటున్నట్టు కాకినాడ, రాజమహేంద్రవరానికి చెందిన రెండు టూర్ ఏజెన్సీలు వివరించాయి. ఉమ్మడి జిల్లాలో కశ్మీర్ టూర్‌కు టికెట్లు బుక్ చేసుకున్న పర్యాటకులకు హోటల్స్ బుకింగ్ రద్దుకు అంగీకరించగా, కొన్ని విమాన కంపెనీలు టికెట్ బుకింగ్ ఆప్షన్‌లో క్యాన్సిలేషన్ లేదేని తెగేసి చెబుతున్నాయి. కశ్మీర్ వెళ్లేవారంతా ఢిల్లీ నుంచే రైళ్లలోను, విమానాల్లోనూ వెళతారు. దీంతో కొందరు డబ్బులు వదిలేసుకుని పర్యటన రద్దు చేసుకోగా.. కొందరు పర్యాటకులైతే డబ్బులు వదులుకోలేక ఢిల్లీ వరకు వెళ్లి కొన్నిరోజులు ఉండేలా సిద్ధమవుతున్నారు. ఇలా కొందరు పర్యాటకులు ఈనెల 26, 27 తేదీల్లో పయనమవుతున్నట్టు రాజమహేంద్రవరానికి చెందిన ట్రావెల్ ఏజెన్సీ వివరించింది. ఇప్పటికే శ్రీనగర్‌లో ఉన్న పర్యాటకులు వెనక్కు రావడానికి విమానం టిక్కెట్లు బుక్ చేయాలని, లేదా ఢిల్లీదాకా తెలిసిన టూర్ ఏజెన్సీ వాహనాలు బుక్‌చేయాలని కోరుతున్నట్టు సమాచారం.

వేసవిలో వెళ్లేది ఇందుకే..

ఏప్రిల్‌లో మనకు ఎండలు మండిపోతుంటాయి. 38 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉంటుంది. కశ్మీర్‌లో పగటి ఉష్ణోగ్రత 5 నుంచి 13 డిగ్రీల వరకు ఉంటుంది. రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అనేక చోట్ల మైనస్ 3 డిగ్రీలు ఉంటుంది. గురువారం కశ్మీర్‌లోని సోనామార్గ్‌లో రాత్రి 8 గంటలకు ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు నమోదైంది. బుధవారం అయితే రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మైనస్ 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉగ్రవాద దుశ్చర్య జరిగిన పహల్గాంలోని బైసరన్‌లో గురువారం రాత్రి రెండు డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. కశ్మీర్‌లో అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సైతం ఆరు నుంచి ఎనిమిది డిగ్రీలే ఉంటోంది. ప్రకృతి అందాలు, హిమాలయ సోయగాలు ఈ సమయంలో ఎంతగానో అలరిస్తాయి. దీంతో కశ్మీర్‌కు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.

కశ్మీర్‌కు ఇప్పుడే ఎందుకంటే..

జమ్ముకశ్మీర్ ఏప్రిల్ నుంచి మరింత అందంగా మారుతుంది. ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తుంది. మార్చి మూడో వారం వరకు కశ్మీర్‌లోని శ్రీనగర్, పహల్గాం, గుల్మార్గ్, సోనామార్గ్, దాల్ లేక్ ప్రాంతాల్లో మంచు కురుస్తుంటుంది. మార్చి ఆఖరు నుంచి.. ఏప్రిల్ ఆరంభంలో మంచు కురవడం ఆగిపోయి వందల మీటర్ల ఎత్తులో పేరుకుపోయిన భారీ మంచు కొండలు కరగడం మొదలవుతాయి. ఈ సమయంలో హిమాలయాలు, దాల్ లేక్‌లో పడవ ప్రయాణం జీవితంలో మర్చిపోలేని అనుభూతి. అందుకే ఈ సమయంలో పర్యాటకులు దేశవ్యాప్తంగా కశ్మీర్‌కు పోటెత్తుతారు. ప్రతి ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి ఈ సీజన్‌లో కశ్మీర్‌కు గ్రూపు బుకింగ్‌లు ఎక్కువ ఉంటాయి.

ఏ రైలూ.. ఖాళీ లేదు..!

- » రైళ్లన్నీ ఫుల్.. రిజర్వేషన్లు నిల్
- » వేసవికి విహార యాత్ర ఎలా?
- » తిరుపతికి డబుల్ డెక్కరే గతి
- » బెంగళూరు..చెన్నైకి ఖాళీల్లేవ్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వేసవి సెలవులు వచ్చేశాయి. ఏడాది అంతా చదువులతో కుస్తీ పట్టే పిల్లలు.. ఇంటి పట్టునే ఉంటూ కుటుంబం బాగోగులు చూసుకొనే గృహిణులు.. ఉదయం ఆఫీస్‌కి వెళ్లి సాయంత్రం ఇంటికి చేరే ఉద్యోగులు.. కాస్త సేదతీరాలనుకొనే రోజులు ఏప్రిల్, మే నెలలు.. ఏడాదిలోని మిగతా నెలల్లో పిల్లలకు స్కూలు ఉండడంతో ఎక్కడికైనా వెనకడుగు వేస్తారు. వేసవిలో పిల్లలకు స్కూళ్ల సెలవులు ఇస్తారు కాబట్టి.. అలా ఎక్కడికైనా విహారయాత్రకు వెళదామని ప్లాన్ చేసుకుంటారు. ఏ టూర్‌లో అయినా రైలు ప్రయాణమే కీలకం. రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు చేయించుకుంటే పర్వాలేదు. ఇప్పటికిప్పుడు బయలుదేరితే మాత్రం కష్టమే. రైళ్లలో ఇప్పటికే మే నెలాఖరు వరకూ స్లీపర్‌తోపాటు ఏసీ క్లాసుల రిజర్వేషన్లు నిండుకున్నాయి. వెయిటింగ్ లిస్టులోకి ఎప్పుడో వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఏ రైలు చూసినా కిక్కిరిసి కనిపిస్తోంది.

- సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే రైళ్ల నడిచే తేదీలను పొడిగించడం మినహా చెప్పుకోగ్గ స్థాయిలో ఈ ప్రాంతం వాళ్లకు ఈ వేసవి ప్రత్యేక రైళ్ల విషయంలో ఆ శాఖ దయ చూపలేదు. హైదరాబాద్‌కి వందే భారత్‌లు నడుస్తున్నా చార్జీలు సామాన్యుడు భరించలేనంతగా ఉన్న విషయం తెలిసిందే.
- వేసవిలో ముఖ్యంగా తిరుపతికి రద్దీ ఉంటుంది. కానీ శేషాద్రి ఎక్స్‌ప్రెస్ వెయిటింగ్ లిస్టు 100కి చేరగా, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో టికెట్లే లేవు. దిబ్రూగఢ్, సంత్రాగచి, హౌరా నుంచి వచ్చే రైళ్లలో రిజర్వేషన్లు క్లోజ్ అయిపోయాయి. వారంలో మూడు రోజులు నడిచే డబుల్ డెక్కర్‌కి కొన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ రైలుకు మినహా ఏ రైలుకూ తిరుపతికి రిజర్వేషన్లు ఖాళీ లేవు.
- బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హతియా- హౌరా -న్యూతిన్సుకియా, టాటా, భువనేశ్వర్ నుంచి వచ్చే రైళ్లు రాజమండ్రి గుండా వెళుతున్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమండ్రి వస్తుంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతి న్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికో సారి, గువాహటి నుంచి వారానికి మూడు సార్లు రైళ్లున్నా బోగీల్లో కాలుపెట్టలేం.
- చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి రైళ్లు ఉన్నాయి. హౌరా- కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికోసారి, సిల్చార్- కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్-విల్లుపురం, భువనేశ్వర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా -తిరుచిరాపల్లి (సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడు రోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్ -త్రివేండ్రం(మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శని వారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగుపెట్టడానికి వీలుండదు.

ఇంటర్ సిటీలు వేయాలి..

ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్, అసోం, బిహార్ నుంచి ఉపాధి పనుల నిమిత్తం కూలీలు పెద్ద సంఖ్యలో కేరళ, తమిళనాడు, కర్నాటక వెళుతుంటారు. వేసవిలో తిరుగు ప్రయాణమవుతారు. అందుకే చెన్నై, బెంగళూరు, అళపుజ, తిరువనంతపురం నుంచి సిల్చార్, న్యూతిన్సూకియా వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఖాళీ ఉండదు. ఈ క్రమంలో వేసవి సెలవులకు విహారయాత్రలకు వెళదామని అనుకున్న వారితోపాటు ఆస్పత్రి పనులపై చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ వెళ్లేవాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కొత్తగా వారాంతపు, బైవీక్లీ రైళ్లు వేస్తున్నా ఈ ప్రాంతం వాసులకు ఉపయోగం ఉండడం లేదు. ఈ ప్రాంతం నుంచి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌లు వేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వేసవిలో నైనా విశాఖ-విజయవాడ,విజయవాడ-చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, విశాఖ- భువనేశ్వర్,రాజమండ్రి-విజయవాడ, విశాఖపట్నం ఇంటర్ సిటీలు నడపితే నాలుగు జిల్లాల ప్రయాణికుల తిప్పలు తగ్గే అవకాశం ఉంది.

వితంతు పింఛన్లకు దరఖాస్తులు స్వీకరణ

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : వితంతు పింఛన్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించింది.ఈ నేపథ్యంలో 2023 డిసెంబర్ 1 నుంచి 2024 డిసెంబర్ 31 మధ్య మరణిస్తే భార్యకు పింఛను మంజూరు చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు జిల్లాలో 3408 మంది అర్హులు ఉన్నారన్నారు. వితంతు పింఛన్ దరఖాస్తులు అప్‌లోడ్ చేయడానికి పోర్టల్ ప్రారంభించామన్నారు. అర్హులంతా సమీపంలోని సచివాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీఆర్ఎస్, ఇతర విధానాల్లో పింఛన్ అర్జీలను పరిశీలించి జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటి వరకూ అర్హులు అనపర్తిలో 156మంది, బిక్కవోలులో 165, చాగల్లులో 152, దేవరపల్లిలో 163,గోకవరంలో 154, గోపాలపురంలో 165, కడియంలో 157, కోరుకొండలో 217, కొవ్వూరులో 127, కొవ్వూరు అర్బన్‌లో 42, నల్లజర్లలో 176, నిడదవోలులో 142, నిడదవోలు అర్బన్‌లో 60, పెరవల్లిలో 151, రాజమండ్రి అర్బన్‌లో 303,రాజమండ్రి రూరల్‌లో 234, రాజానగరంలో 241, రంగంపేటలో 158, సీతానగరంలో 173, తాళ్లపూడిలో 106, ఉండ్రాజవరంలో 166మంది ఉన్నారన్నారు. వీరంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రాజమహేంద్రవరంలో టాటా ఇన్నోవేషన్ హబ్ 8

నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నీటి తీరువా వసూలు వేగవంతం చేయాలని కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. జేసీ చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి గురువారం రెవెన్యూ, పీజీ ఆర్ఎస్, రీసర్వే వంటి అంశాలపై సమీక్షించారు. మండలాల వారీగా నీటివినియోగదారుల సంఘాల వివరాలు ప్రచురించాలన్నారు. నీటి తీరువా వసూళ్ల విషయంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితో పర్యవేక్షణ చేయిస్తుందన్నారు.జిల్లాలో 2.8 లక్షల ఎకరాల ఆయకట్టు పరిధిలో రూ.2,84, 51,378 మేర పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు.ఇప్పటి వరకూ రూ.2,00,11,361 వసూలైందన్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 40.57 శాతం, కొవ్వూరు డివి జన్‌లో 43.75 శాతం వసూళ్లు చేసినట్టు చెప్పారు. ఆయకట్టు పరిధిలో సాగు విస్తీర్ణం హెచ్చుతగ్గులను రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్ధారణ చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముఖ్యంగా భూమి కొలతల్లో వ్యత్యాసాలు,ఎల్‌పీఎంకు చెందిన విభజన, దిద్దుబాట్లు, మ్యుటేషన్, సరిహద్దు కొలతలు ఐదు అంశాలు ఉన్నాయన్నారు. కొందరు సమీక్షలకు వచ్చామా, వెళ్లామా అనే ధోరణిలోనే ఉంటున్నారని అది సరికాద న్నారు. సమావేశంలో ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి, జిల్లా సర్వే అధికారి బి. లక్ష్మీ నారాయణ, ఏవో అలీ, తహశీల్దార్లు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఎండ మావులు



భానుడు గురువారం ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి చేశాడు.. ఏకంగా 42 డిగ్రీలకు చేరి మండిపడ్డాడు.. దీంతో జనం ఆపసోపాలు పడ్డారు.. ఈ నేపథ్యంలో రాజమ హేంద్రవరంలో ఇలా ఎండమావులు దర్శనమిచ్చాయి. వీటిని జనం ఆసక్తిగా తిలకించి కెమెరాల్లో బంధించారు.

- ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



హాస్టల్..డల్!

- » హాస్టళ్లలో ఉత్తీర్ణత శాతం అంతంతే
- » ఎస్సీ, బీసీ హాస్టళ్లలో పూర్ రిజల్ట్
- » బాగా పడిపోయిన ఉత్తీర్ణత శాతం
- » 65 మంది వరకూ ఫెయిల్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : హాస్టల్ విద్యార్థులు డల్‌గా ఉన్నారు.. జిల్లాలోని ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో పదవ తరగతి విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఫెయిలయ్యారు. దీంతో సంక్షేమ హాస్టల్స్‌లో విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. బీసీ హాస్టల్స్‌కు సంబంధించి 92 మంది పరీక్షలు రాస్తే 69 మంది ఉత్తీర్ణులయ్యారు. 23 మంది ఫెయిలయ్యారు. మొత్తం 46 మంది బాలురు, 46 మంది బాలికలు పరీక్షలు రాశారు. వీరిలో 29 మంది బాలురు, 40 మంది బాలికలు ఉత్తీర్ణులయ్యారు. రాజమహేంద్రవరం అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి పరిధిలో 32 మంది టెన్త్ పరీక్షలు రాస్తే నలుగురు బాలురు, 12 మంది బాలికలు పాసయ్యారు. 16 మంది ఫెయిల్ కావడం గమనార్హం. కొవ్వూరు అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి పరిధిలో 60 మంది పరీక్షలకు హాజరుకాగా బాలురు 25 మంది, బాలికలు 28 మంది పాసయ్యారు. ఏడుగురు బాలురు ఫెయిలయ్యారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో చదువుతున్న 179 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయగా 137 మంది మాత్రమే పాసయ్యారు. 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజమహేంద్రవరం ఏఎస్‌డబ్ల్యూవో పరిధిలో 47 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 38 మంది పాస య్యారు. 9 మంది ఫెయిలయ్యారు. ఎస్సీ హాస్టల్స్ విద్యార్థుల్లో మోర్త నవీన్ (బాలుర వసతిగృహం 1, రాజమహేంద్రవరం) 521 మార్కులు సాధించి హాస్టల్ విద్యార్థుల్లో టాప్‌లో నిలిచాడు. అలాగే, కర్రి రాహుల్ 518 మార్కులు (బాలురు వసతిగృహం, గౌరీపట్నం), పెన్నాడ శ్రావణి 505 మార్కులు, మానుకొండ హర్షిణి 503 మార్కులు (ఐడబ్ల్యూహెచ్‌సీ, బాలికల వసతి గృహం, చిన్నాయిగూడెం) సాధించారు. ఎస్టీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులు ముగ్గురు ఫెయిలయ్యారు.

భవన నిర్మాణ కార్మికుల హామీలు నెరవేర్చాలి

● కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుని పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు మద్దుకూరి దొరయ్య డిమాండ్ చేశారు. గురువారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. తర్వాత డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మితకు అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుందరబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్మాణరంగ కార్మికులకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికలలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా .. నేటికీ ఆ హామీ అమలు చేయలేదన్నారు. కార్మికుల సంక్షేమ బోర్డులో ఉన్న రూ. 4,298 కోట్లు కార్మికుల సంక్షేమానికి వినియోగించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. పవన్, బి. పూర్ణిమరాజు, మైగాపుల నాగేశ్వరరావు, వీరా త్రిమూర్తులు, పి. గంగాధరం, ఎం. హరిబాబు, రేఖ నాగేశ్వరరావు, జొన్నల రాంబాబు, నందం కొండబాబు, జి. శ్రీను, కె. శివ, ఎస్.కె. ఆదామ్, కె. తాతారావు, రామకృష్ణ, కేదార్, సత్తిబాబు, సత్యనారాయణ, పోతురాజు, భద్రం, వెంకట్రావు, చిట్టిబాబు, జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

తీపర్రు టీడీపీ కార్యాలయ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పెరవలి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రవేశపెట్టిన పథకాలను గ్రామస్థాయిలో విరివిగా ప్రచారం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అతికాల శ్రీను పేర్కొన్నారు. తీపర్రు టీడీపీ కార్యాలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన పలు హామీలను నెరవేర్చడం జరిగిందని, మిగిలినవి రానున్న రెండు, మూడు నెలల్లో నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కంటిపూడి సూర్యనారాయణ, నందమూరి నారాయనరావు, దేవరపల్లి సత్యనారాయణ, కరుటూరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

'మానవతా' సంస్థకు విరాళం అందజేత



చెక్కును అందిస్తున్న సత్యనారాయణ

నల్లజర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మానవతా స్వచ్ఛంద సేవా సంస్థపై ఉన్న మక్కువతో అచ్చన్నపాలెంకి చెందిన మానవతావాది, పాతూరి సత్యనారాయణ కుమారుడు, అమెరికా నివాసి పాతూరి హరినాథ్, లక్ష్మీసౌజన్య దంపతులు మానవతా సంస్థకు రూ. మూడు లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును గురువారం జిల్లా మానవతా సంస్థ కన్వీనర్ కండెపు వెంకట సూర్యనారాయణకు అందించారు. కార్యక్రమంలో పాతూరి రమేష్, ఎస్. రాజేంద్రప్రసాద్, ఐడీపీ అప్పారావు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై పశువుల దాణా

చాగల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై పశువుల దాణా అందజేస్తున్నట్టు పశువైద్యాధికారి యు.ముఖేష్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెల్లరేషన్ కార్డు కలిగిన పాడి రైతులు అర్హులన్నారు. ప్రారంభంలో ఒక బస్తా మాత్రమే ఇస్తారని చెప్పారు. దగ్గరలోని రైతుసేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు. ఇందులో పట్టణంలో చేపట్టిన, చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై చర్చిస్తామన్నారు. ఆరోజు ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ రత్నకుమారి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి 23 వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

విద్య, వైద్యరంగానికి ప్రాధాన్యం

● ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. యర్నగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో యర్నగూడెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రాంగణంలో రూ.37 లక్షలతో నిర్మించనున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో మంచి గుర్తింపు విద్యతోనే సాధ్యమన్నారు. యర్నగూడెంకి చెందిన టీడీపీ నేత పెనుమత్స సుబ్బరాజు రూ. మూడు లక్షలు, అలాగే మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రూ అనీల్ రూ. 50 వేలు, మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు రూ. 50 వేలు, కృష్ణం పాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బిక్కిన నాగరాజు రూ.50 వేలు, కురుకూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకు లు కొయ్యల మూడి చంద్రశేఖర్ రూ. 50 వేలు విరాళాలు ప్రకటించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొంతా భరత్‌బాబు, టీడీపీ నాయకులు యద్దనపూడి బ్రహ్మరాజు, గద్దే శ్రీనివాస్, బొల్లిన విజయ్ భాస్కర్, జూనియర్ ప్రిన్సిపాల్ చత్రపతి శివాజీ, జనసేన నాయకులు కట్నాం గణేశ్, బళ్లా రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీ రాజ్ దినోత్సవం



మాట్లాడుతున్న సర్పంచ్ గండి రాంబాబు

తాళ్లపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గజ్జరంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గండి రాంబాబు పాల్గొని మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం ద్వారా రామరాజ్యం సాధించాలని కలలు గన్న మహనీయుడు గాంధీజీ అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దండమూడి శేషగిరి, వార్డు మెంబర్లు, నాయకులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. అలాగే వేగేశ్వరపురంలో పంచాయతీ కార్యాలయం వద్ద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, వీఆర్ వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపర్రు, పాలంగిలో...

ఉండ్రాజవరం: మండంలోని తాడిపర్రు, పాలంగిలో పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. దీనిలో భాగంగా తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ జవ్వాది వీరభద్రం, కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి పి. ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలంగిలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భావన మధుపూర్ణచంద్ అధ్యక్షతన గురువారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీరాజ్ చట్టం చేయబడిందన్నారు. గ్రామ సభలో పంచాయతీ పరిధిలోని అన్ని శాఖలు గ్రామంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాలాలక్ష్మి సీతయ్య నాయుడు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: మనిషి మూలాల నుంచి పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పడిందని ఇన్‌చార్జి ఎంపీడీవో బీఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామపం చాయతీ కార్యాలయాల వద్ద గురువారం గ్రామసభలు నిర్వహించారు. అందులో భాగంగా గోపాలపురం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన సభలో శ్రీనివాస్ మాట్లాడుతూ మనిషి పుట్టిన నాటి నుంచి మరణం వరకు సేవలందించటమే పంచాయతీరాజ్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తాడిపర్రులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మధు

'సరస్వతి' పుష్కరాలకు ప్రత్యేక బస్సులు : డీఎం

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15వ తేదీ నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల్లో పుణ్యస్నానాలు ఆచరించడానికి ఈనెల 14న సరస్వతి ధామం పుష్కరయాత్ర స్పెషల్ బస్సు నడుపుతున్నామన్నారు. ఈ స్పెషల్ బస్సు బాసర, జ్ఞానసరస్వతి, ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి, కాళేశ్వరం మహా కాళేశ్వరుడు, సరస్వతి పుష్కరస్నానం, కొండగట్టు ఆంజనేయస్వామి, వేములవాడ రాజరాజేశ్వరస్వామి, వరంగల్ భద్రకాళీమాత, రామప్ప దేవాలయ దర్శనంతో మూడు రోజుల యాత్రకు కొవ్వూరు డిపో ఫోన్ 73829 07952 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. యాత్రలో బస చేయడానికి రూమ్, భోజనం ఖర్చులు యాత్రికులే భరించాలన్నారు.

రాజమండ్రిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్ర వరం కేంద్రంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ఏర్పాటు చేయడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిందని, దీని కోసం రెండు ఎకరాల భూమిని కూడా సేకరించనున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం ఆర్టీఐహెచ్ సభ్యులతో తొలి సమావేశం నిర్వహించారు. ఇందులో జేసీ ఎస్. చిన్నరాముడు, గ్రీన్‌కోర్, ఓఎన్‌జీసీ, గెయిల్, ఇతర ఇన్నోవేటివ్ ఏజెన్సీలు, ఎన్ఐటీఏ, జేఎన్‌టీకై ఎక్స్‌పెర్ట్ టీమ్,పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ, ఇతర సమన్వయ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త తయారవ్వాలనే సీఎం చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యాచరణ లక్ష్యంగా గుర్తించిన వ్యక్తులను పరిజ్ఞానాన్ని అందించి, ఆలోచనల నుంచి నూతన ఆవిష్కరణలు చేపట్టవలసి ఉందన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ఏ.గోపాలకృష్ణ, ఎన్ఐటీఏ డైరెక్టర్ జి.రవి కిరణ్‌శాస్త్రి, గ్రీన్‌కో సీఈవో పి.రాంబాబు, ఐటీయూఅండ్ సీ-ఓఎస్‌డీ ఆర్.దీప్తి, గెయిల్ అధికారి డి.ప్రభాకర్, ఓఎన్‌జీసీ అధికారి జి.శ్రీనివాస్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీవనిధర్ రామన్, డీఆర్‌డీఏ పీడీ మూర్తి, ఆర్ఎంసీ నుంచి కొండల రావు, మెప్మా శ్రీదేవి పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిర నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న శ్యామానంద్ ప్రభు

తాళ్లపూడి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మానవతా విలువలు, ఆధ్యాత్మిక విలువలు దిగజారిపోతున్నాయని ఇస్కాన్ వ్యవస్థాపకుడు శ్రీ ప్రభుపాదుల వారు తెలిపినట్టు రాజమండ్రి ఇస్కాన్ ప్రతినిధి శ్యామానంద ప్రభు చెప్పారు. గురువారం ప్రక్కిలంకలో నిర్మించే ఇస్కాన్ టెంపుల్‌కు భూమిపూజ చేశారు. ఇస్కాన్ భక్తులు , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి

చాగల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కాలలో కొబ్బరి దింపు కార్మికుడు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందినట్టు ఎస్సై కే.నరేంద్ర తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం తాడిమళ్లకు చెందిన కోలా ధనరాజు (22) తోటి కొబ్బరి కాయలు దింపు కార్మికులతో కలిసి పనికి వెళ్లాడు. కొబ్బరి చెట్టు నుంచి కాయలు దించుతుండగా, అతను నరికిన కొబ్బరి ఆకు పక్కన ఉన్న విద్యుత్ తీగలపై పడి షాక్‌కు గురయ్యాడు. దీంతో తోటి కార్మికులు అతన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే అతను చనిపోయినట్టు వైద్యులు చెప్పారు. ఈవిషయమై మృతుడి అన్నయ్య శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడుకి ఇంకా వివాహం కాలేదు.

పేకాటరాయుళ్లపై కేసు

చాగల్లు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మీనానగరం శివారులో పేకాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ కే. నరేంద్ర గురువారం తెలిపారు. వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించగా, వారి వద్ద నుంచి రూ. ఎనిమిది వేలు నగదు, పేకాట ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

మైనర్ అదృశ్యంపై ..

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. పట్టణానికి చెందిన 10వ తరగతి విద్యార్థి ఈ నెల 21వ తేదీ నుంచి కనిపించడం లేదని సదరు బాలిక తల్లి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు.

'పది' విద్యార్థులకు సత్కారాలు



విద్యార్థులను అభినందిస్తున్న సుబ్బరాయచౌదరి

కొవ్వూరు, ఏప్రిల్24 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జొన్నలగడ్డ రాధారాణి అభినందించారు. గురువారం కొవ్వూరు అభ్యాస పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన బి. తేజ సుమశ్రీ 596, బి. గగన్ 595కు అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పాఠశాల డైరెక్టర్లు, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జొన్నలగడ్డ రాధారాణి విద్యార్థులను, ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పాలడుగుల వాసు, పాలడుగుల భార్గవి, ఫౌండర్ ఉపాధ్యాయులు పాలడుగుల రఘురామ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ హైస్కూల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాజీ మున్సిపల్ వైస్‌ఛైర్మన్ దుద్దుపూడి రాజేరమేష్ నగదు పురస్కారాలు అందజేశారు. గుర్రపు దేవకి 580, పరవట లాస్యప్రియ 577, కుందేటి సాయి ఉత్తేజ్ దీపక్ 572, ములుపురి జ్యోత్స్న 572 మార్కులు సాధించగా, ఒక్కొక్కరికి రూ.ఐదువేలు చొప్పున నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వి. గంగాభవాని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: వెలగదుర్రుకి చెందిన కవలలు గున్నేపల్లి తనుశ్రీ, తన్విక ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. దీంతో గ్రామస్థులు వారిద్దరిని గురువారం సత్కరించారు. వీరు ఉండ్రాజవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివారు. తన్విక 1000 మార్కులకు గాను 815 మార్కులు సాధించి కళాశాలలో ప్రథమస్థానంలో నిలవగా, తనుశ్రీ 1000 మార్కులకు గాను 789 మార్కులు సాధించింది. గ్రామమాజీ సర్పంచ్ ముదునూరి రవీంద్రరాజు, నాయకులు పాతూరి నరేంద్రబాబు, దాసరి వెంకన్న, దొడ్డా సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి షాన్‌బీబీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

సోలార్ ఏర్పాటుపై అవగాహన సదస్సులు



నల్లజర్లలో డ్వాక్రా సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

నల్లజర్ల, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్‌లను అందిస్తుందని విద్యుత్‌శాఖ డీఈ ఎం. శివప్రసాద్ అన్నారు. గురువారం నల్లజర్ల ఐకేపీ కార్యాలయంలో డ్వాకా మహిళలు, గుర్తించిన లబ్ధిదారులకు సోలార్ ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సోలార్ సిస్టమ్ ద్వారా కరెంట్ బిల్లు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ రమణ, బాపిరాజు ఏపీఎం శ్యాంసుందర్, డ్వాక్రా మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండల సమాఖ్య కార్యాల యంలో ఏపీఎం మంగాయమ్మ ఆధ్వర్యంలో గురువారం పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించారు. ఇందులో పాల్గొన్న ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ స్కీంలో చేరితే ఒక్క రూపాయి కూడా కరెంటు బిల్లు కట్టాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల వీవోలు, సీఏలు, క్లస్టర్ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: పీఎం సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకుంటే ఒక్క రూపాయి కూడా కరెంటు బిల్లు కట్టనవసరం లేదని విద్యుత్ ఏఈ సుంకర త్రిమూర్తులు తెలిపారు. మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం మహిళ సంఘాలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఎం పోశమ్మ, గ్రామసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పెరవలి: పీఎం సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా ఇళ్లపై సోలార్ ప్లేట్లు అమర్చుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని ఏపీఈపీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ఇంజనీర్ పీయూపీ శ్రీధర్ పేర్కొన్నారు. మండల సమైక్య కార్యాలయంలో ఈ పథకం పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ పథకం గురించి తెలియజేశారు. అనంతరం అసిస్టెంట్ ఇంజనీర్ ఎం.డేవిడ్ నిశ్చల్ మాట్లాడారు. సమావేశంలో ఏపీఎం రామకృష్ణ, అన్నవరప్పాడు, ఖండవల్లి, క్లస్టర్ వీవోఏలు, ఇతర లబ్ధిదారులు హాజరయ్యారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్

ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్

ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



సమిశ్రగూడెం యూనిట్ నూతన కార్యవర్గం

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం సమిశ్రగూడెం యూనిట్ అధ్యక్షుడిగా నరహరిశెట్టి రవికుమార్ నియమితులయ్యారు. గురువారం సమిశ్రగూడెంలో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ ఎన్నికలు జరిగాయి. దీనికి గున్నూరి శ్రీధర్ రాజు, సంతోష్ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఇందులో సమిశ్రగూడెం యూనిట్ అధ్యక్షుడిగా కొవ్వూరు మండలం పశివేదల జడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న నరహరిశెట్టి రవికుమార్, ఉపాధ్యక్షుడిగా ఏ. సునీల్‌కుమార్, కార్యదరిగా ఎన్. ప్రతాప్‌కుమార్, సహాయ కార్యదర్శిగా జి. వెంకట పద్మావతి, ట్రెజరర్‌గా అండమాన్ హిమబిందు, జిల్లా కౌన్సిలర్లుగా పురుషోత్తపల్లికి చెందిన పాలకుర్తి వీర వెంకట సత్యనారాయణ, వి.సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఉమ్మడి జిల్లాల పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి. శ్రీధర్‌రాజు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని పశివేదల, పురుషోత్తపల్లి, బ్రహ్మణగూడెం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంలు జి. రత్నకుమార్, ప్రసాద్, విజయకుమార్, జూనియర్ అసిస్టెంట్ మద్దూరి నాగాదిత్య శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

ఉగ్ర దాడులకు నిరసనగా ర్యాలీలు



దేవరపల్లిలో మృతులకు నివాళి అర్పిస్తున్న సువర్ణరాజు, జనసేన పార్టీ నాయకులు

దేవరపల్లి, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన పౌరుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ గురువారం మౌనదీక్ష చేపట్టినట్టు గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కాట్నం గణేశ్, కృష్ణంపాలెం సర్పంచ్ నాయుడు దుర్గాప్రసాద్, జనసేన నాయకులు పసుపులేటి ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, కంబాల సత్తిబాబు, పోసిన వెంకటరత్నం, పాపోలు ప్రదీప్, అనిశెట్టి మధు, సూరిశెట్టి బాలు, అడబాల మణికంఠ, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ నాయ కుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, గద్దే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలని, మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుటూరి శ్రీనివాస్, నందిగం బులిరాజు, తంగెళ్ల మునేశ్వరరావు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన 28 మంది పౌరులకు సంతాపం తెలియచేస్తూ ఉగ్రవాదుల చర్యలను తీవ్రంగా ఖండిస్తూ మండల కేంద్రమైన తాళ్లపూడిలో ఆర్ఎస్ఎస్, ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ముఖ్యవీధుల గుండా కొవ్వొత్తులను చేత బట్టుకుని ర్యాలీ సాగించారు. అమరులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు మాట్లాడుతూ భారత దేశం ఎల్లప్పుడూ శాంతిని కోరుకుంటుంటే, ప్రత్యర్థి దేశాలు వికృతమైన చర్యలకు పాల్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మండల అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు గంటా కృష్ణ, గ్రామ ఉప సర్పంచ్ అప్పన జగదీష్, నియోజకవర్గ టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షుడు కడలి కిరణ్ కుమార్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అడ్డా శ్రీరామమోహన్, బొర్రా శ్రీరామ్మూర్తి, యోగా టీచర్ నక్కా వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్, ఎన్డీఏ కూటమి నాయకులు

మహిళకు గాయాలు

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ గాయపడినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 23వ తేదీన పట్టణానికి చెందిన మాధురి వెంకటలక్ష్మి, గొర్రెల ధనలక్ష్మి కూలి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా దొమ్మేరు పెట్రోల్ బంకు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మాధురి వెంకటలక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో గుర్తుతెలియని మృతదేహాన్ని రూరల్ పోలీసులు గుర్తించారు. గట్టు సత్తెమ్మ వారి ఆలయం వెనుక 55 సంవత్సరాల వయసు కలిగిన మృతదేహం కనిపించింది. దీంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతునికి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. మృతుడు భిక్షాటన చేసుకునే మాదిరిగా ఉన్నాడని, అనారోగ్యం లేదా ఎండ తీవ్రతను తట్టుకోలేకే మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు కొవ్వూరు రూరల్ పోలీస్‌స్టేషన్ 9440796623 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

నగదు, బంగారం అపహరణ

కొవ్వూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి) : పట్టపగలే తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారం, నగదు దొంగిలించుకుపోయిన సంఘటన కొవ్వూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. గౌతమీనగర్‌కు చెందిన కంకటాల సిద్ధ గణపతి స్వీట్ షాప్ నడుపుకుని జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం ఏడు గంటలకు ఇంటితాళం పెట్టి పనిమీద గొల్లగూడెం వెళ్లాడు. తిరిగి మధ్యాహ్నం 3-30 గంటలకు వచ్చేసరికి ఇంటితాళాలు పగులగొట్టి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని రూ. లక్ష నగదు, 3 కాసుల బంగారం దొంగిలించుకుపోయినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

గోపాలపురం, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధ్యాయుడు దిర్శిపాం సుబ్బారావు (61) బుధవారం అర్ధరాత్రి కన్నుమూశాడు. ఈయన గత ఐదు సంవత్సరాలుగా బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నట్టు ఎంఈవో జీ.శ్రీనివాసరావు తెలిపారు.